



రూ.85లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురాంరెడ్డి

'ఇంతింతై వటుడింతై' అన్నట్లు ఇల్లెందులో పురుడుపోసుకున్న సిరుల తల్లి సింగరేణి నేడు దేశ విదేశాల్లో ఖ్యాతిని గడించింది. యావత్ ప్రభుత్వ రంగ పరిశ్రమలకే ఆదర్శంగా పురోగమిస్తోంది. ఎన్ని సవాళ్లు ఎదురైనా.. సమస్యలు చుట్టుముట్టినా వ్యూహాత్మకంగా వ్యవహరించే సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్ ఇతర డైరెక్టర్లు అధికారులు, కార్మికులు సంఘటిత శక్తితో సంస్థ అభివృద్ధి పథంలో పయనిస్తోంది. 135 సంవత్సరాల వయస్సు పైబడినా ఉరకలెత్తే యువతరానికి జవసత్వాలు అందిస్తోంది. వేలాది అడుగుల లోతున భూమి పొరలను చీలుస్తూ దేశ పారిశ్రామిక రంగానికి కీలకమైన నల్ల బంగారాన్ని అందిస్తున్నా.. సింగరేణి కాలరీస్ నేడు 104వ జన్మదినోత్సవాన్ని జరుపుకొంటోంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...



నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం

సింగరేణి.. సిరులవేణి

- సంస్థ అభివృద్ధికి బహుముఖ వ్యాపార విస్తరణపై దృష్టి
- ఇప్పటికే థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ప్రారంభం
- కొత్తగా గ్రీన్ హైడ్రోజన్, మిథనాల్ తయారీపై దృష్టి
- ఉత్పత్తితో పాటు కార్మికుల సంక్షేమంపై మరింత దృష్టి

సవాళ్లను అధిగమిస్తూ బొగ్గు ఉత్పత్తిలో రికార్డులు

ఇల్లెందు/కొత్తగూడెం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నాటి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇల్లెందులో 1889లోనే డెక్కన్ కంపెనీ బొగ్గు ఉత్పత్తి ప్రారంభించినా పూర్తిస్థాయిలో 1920డిసెంబరు 23న సింగరేణి కాలరీస్ పేరుతో లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదు కావడంతో అప్పటి నుంచే ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నారు. సింగరేణి సంస్థ 18 ఓపెన్ కాస్టులు, 22 అండర్‌గ్రౌండ్ గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. దేశ పారిశ్రామిక రంగానికి అవసరమైన బొగ్గులో సింగరేణి 9.2శాతాన్ని సమకూర్చేతోంది. సుమారు 39వేల మంది కార్మికులతో 20వేల మంది కాంట్రాక్టు కార్మికులతో ప్రభుత్వ రంగ సంస్థల్లో తలమానికమైనదిగా బాసిల్లుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 49:51 నిష్పత్తితో వాటాలు ఉన్న సింగరేణి రాష్ట్రంలో ఆరు జిల్లాలో విస్తరించి ఉంది. 3,900 అడుగుల లోతు భూగర్భంలో నిక్షిప్తమైన నల్లబంగారాన్ని వెలికి తీస్తూ దక్షిణాది రాష్ట్రాల పారిశ్రామిక రంగంతో కీలక భూమిక పోషిస్తోంది. నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలు సాధించడమేగాక గత 26 ఏళ్లుగా సంస్థ సాధించిన లాభాల్లో కార్మికులకు సైతం వాటా అందజేస్తున్న ఏకైక ప్రభుత్వ సంస్థగా నిలిచింది. సింగరేణి కంపెనీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నయాపైనా నిధులు ఇవ్వకపోయినా ప్రభుత్వాలపై ఆధారపడకుండా సింగరేణి స్వశక్తి, కార్మిక శక్తిపై ఆధారపడుతూ పురోగమిస్తోంది. కోల్ ప్రభావిత ప్రాంతాల్లో సీఎస్ఆర్ పథకాల ద్వారా ఏటా వేల కోట్ల రూపాయాలను సింగరేణి ఖర్చు చేస్తోంది. ప్రత్యేకించి ప్రస్తుత సింగరేణి చైర్మన్ మైనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ అమలు చేస్తున్న విధాన నిర్ణయాలు సింగరేణికి దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతలు తెచ్చి పెడుతున్నాయి. సింగరేణిలో కార్మికులు వేరు, అధికారులు వేరు కాదన్న భావనలు పెంపొందించడంలో ఆయన సఫలీకృతులయ్యారు.

విద్యావంతులతో నిండుతోన్న సింగరేణి

గతంలో నిరక్షరాస్యులైన కార్మికులు బొగ్గు గనుల్లో తట్ట చెమ్మాస్ వంటి పరికరాలతో బొగ్గు ఉత్పత్తి చేసేవారు. వేలిముద్రలు వేస్తూ గనుల పైనే వేతనాలు తీసుకునేవారు. అలాంటి (మిగతా 6వ పేజీలో)



రాష్ట్రానికి తలమానికం

- కార్మికులు, ఉద్యోగులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



కొత్తగూడెం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ దినోత్సవం జరుపుకొంటున్న సంస్థ ఉద్యోగులకు, కార్మికులకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బొగ్గు ఉత్పత్తి ద్వారా రాష్ట్ర, దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో సింగరేణి సంస్థ కీలకపాత్ర పోషిస్తూ రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సింగరేణి వెన్నెముకగా నిలుస్తున్న విషయాన్ని వివరించారు. తెలంగాణలోని ఆరు జిల్లాల్లో లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారంగా ఉన్న సింగరేణి సంస్థను కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం చేయకుండా ఇతర రంగాలకు విస్తరించే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సింగరేణి సంస్థ సుస్థిర భవిష్యత్ కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శ్రమశక్తిని చాటుతూ సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతీ ఒక్కరు పునరంకితం కావాలని భట్టి కోరారు.

ఇచ్చిన హామీలను మర్చిపోను

- నా శక్తి మేరకు ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి
- సంక్రాంతి నుంచి ఇందిరమ్మ ఇళ్ల సంబురాలు
- అక్రమ కట్టడాలను పునాదుల దశలోనే అడ్డుకోవాలి
- 500 ఎకరాల్లో ఖమ్మం అటవీపార్కు అభివృద్ధి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- నగరంలో రూ.85లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఖమ్మం ప్రజలకు ఇచ్చిన హామీలను తానెప్పుడు మర్చిపోనని, తన శక్తిమేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సంక్రాంతి నుంచి ఇందిరమ్మ ఇళ్ల సంబురాలు ఉంటాయని తెలిపారు. ఖమ్మం నగరంలోని 57వ డివిజన్‌లో ఆదివారం రూ.85లక్షల అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రఫీద ముస్తాఫా అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో తాగునీటి ఎద్దడి నివారణకు ఇప్పటికే రూ.220కోట్లు మంజూరు చేశామన్నారు. ఖానాపురం చెరువు అలుగు ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.250కోట్లు మంజూరు చేసిందన్నారు ఖమ్మంలో ప్రధాన ప్రాంతాలకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు కార్యాచరణ చేస్తున్నామన్నారు. ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉన్న డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని కమిషనర్ అభిషేక్ ఆగస్త్యకు మంత్రి తుమ్మల సూచించారు. హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్క్ తరహాలో ఖమ్మం అర్బన్‌పార్కును 500ఎకరాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. సంక్రాంతి నుంచి ఇందిరమ్మ ఇళ్ల సంబురాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉపాధి కోసం నగరానికి వచ్చి గుట్టలు, కాల్వల మీద గుడిసెలు వేసుకొని నివసిస్తున్న నిరుపేదలకు రాబోయే నాలుగు సంవత్సరాల్లో (మిగతా 6వ పేజీలో)

ఎంపీడీవోల అర్తనాదాలు..

- ఒత్తిడితో ప్రాణాలు కోల్పోతున్న అధికారులు
- పెండింగ్‌లో ఉన్న అలవెన్సులు
- కానరాని ప్రమోషన్ల ప్రక్రియ
- సెలవుల కోసం కూడా కలెక్టర్‌ను కలవాల్సిందే..
- సీఎస్‌ను కలిసిన సంఘం రాష్ట్ర నాయకులు

7

స్థానిక సమరానికి సన్నద్ధం



- నోడల్ అధికారుల నియామకం పూర్తి
- ఎన్నికల నిర్వహణకు అధికారుల సంసిద్ధం

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణ తేదీని ఎప్పుడు ప్రకటించినా అందుకు సిద్ధంగా ఉండేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే జిల్లాకు చేరిన ఎన్నికల నిర్వహణ సామగ్రిని భద్రపరిచారు. 3,146 పెద్దబ్యాలెట్ పెట్టెలు, మరో 825 సాధారణ బ్యాలెట్ పెట్టెలను మరమ్మతులు పూర్తిచేసి సిద్ధంగా ఉంచారు. ఎన్నికల విధులకు 6,826మంది సిబ్బంది వివరాలను ఇప్పటికే సిద్ధం చేశారు. పోలింగ్ సిబ్బంది శిక్షణకు సంబంధించి మాడ్యూల్స్, ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారుల కరదీపికలు జిల్లాకు చేరాయి. ఈ నెల 17న పోలింగ్ కేంద్రాల తుది జాబితాను విడుదల చేశారు. మొత్తం 5,438 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 12 అంశాలకు సంబంధించి జిల్లా అధికారులకు నోడల్ అధికారులుగా బాధ్యతలు అప్పగించారు.

5,438 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ఖమ్మం జిల్లాలో 589 పంచాయతీలు, 5,398 వార్డులకు గాను పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 5,438 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఇప్పటికే పరిశీలించారు. తాగునీరు, ప్రహరీ, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, ర్యాంపులు, తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయా లేదా.. అనే కోణంలో మండలస్థాయిలో అధికారులు పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపడుతున్నారు. కులగణనకు సంబంధించి కుటుంబ సర్వే నమోదు వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడంతో కొద్ది రోజుల్లో రిజర్వేషన్లపై స్పష్టత రానుంది.

నిఘా నీడలో పోలింగ్ సామగ్రి

కొద్ది రోజులుగా ఎన్నికలకు అవసరమైన సామగ్రి జిల్లాకు చేరుతోంది. వీటిని స్థానిక గోదాముల్లో (మిగతా 6వ పేజీలో)

నేటి నుంచి పలు రైళ్ల రద్దు

- మూడో లైన్ పనుల నేపథ్యంలో నిర్ణయం
- వెల్లడించిన ఖమ్మం రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జాఫర్

7

ఫేస్‌బుక్ పరిచయంతో కుచ్చుటోపి

- విడతల వారీగా 16లక్షలు దండుకున్న మాయలేడి
- నిందితులను అరెస్ట్ చేసిన సైబర్‌క్రైం అధికారులు

7

బడి యాదిలో బాల్యమిత్రులు

- రజతోత్సవాల్లో 1973-74 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు
- కుటుంబ సభ్యులతో హాజరు



తనికెళ్లలో రైతు వేముల వెంకటేశ్వర్లు బోరును పరిశీలిస్తున్న ఏడీఈ తిలక్, ఏఈ సురేష్

విద్యుత్ లైన్ సమస్యపై కదిలిన యంత్రాంగం

- తనికెళ్లలో రైతుల బోరుబావులను పరిశీలించిన అధికారులు
- 'హలో..ఎస్ఈ' కార్యక్రమానికి స్పందన

కొణిజర్ల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'హలో.. ఎస్ఈ' ఫోన్ ఇన్ కార్యక్రమానికి స్పందన లభించింది. కొణిజర్ల మండలం తనికెళ్లకు చెందిన రైతు వేముల వెంకటేశ్వర్లు చేసిన ఫిర్యాదుపై స్పందించిన విద్యుత్‌శాఖ ఏడీఈ తిలక్, ఏఈ సురేష్, సిబ్బందితో ఆదివారం సదరు రైతుతోపాటు మరి కొంతమంది రైతుల పొలాల్లోని బోరు, బావులను పరిశీలించారు. సదరు రైతులు తాము బోరు బావులు ఏర్పాటు చేసుకున్నా ఏడాదిగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదని 'ఫోన్‌ఇన్' కార్యక్రమంలో ఫిర్యాదు చేయగా ఈ మేరకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఏడీఈ, ఏఈ మాట్లాడుతూ 'హలో.. ఎస్ఈ'లో రైతుల ఫిర్యాదులపై ఎస్ఈ ఆదేశం మేరకు ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ చేశామన్నారు. విద్యుత్‌లైన్ల ఏర్పాటుకు అంచనాలు తీసుకున్నట్లు తెలిపారు. అలాగే కొంతమంది రైతులు తమకు అగ్రికల్చర్ సర్వీస్ బిల్లులు రావడం లేదని ఫిర్యాదు చేశారని, వాటిని కూడా పరిశీలించారని తెలిపారు. సాంకేతిక సమస్యల వల్లనే ఆయా బిల్లులు రాలేదని తెలిపారు. తమ విద్యుత్ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించటం పట్ల రైతులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర అభివృద్ధి కోసం పోరాటాలు

- జిల్లాపై ముగ్గురు మంత్రులది వివక్షపూరిత వైఖరి
- ప్రజా సమస్యలపై మహాసభలో పలు తీర్మానాల ఆమోదం
- సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు

7



విద్యుత్‌శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

- 15 మంది నుంచి రూ.1.76 కోట్లు వసూలు
- ఇద్దరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన మహబూబాబాద్ రూరల్ సీఐ

వివరాలు : 6లో

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు..
- కేంద్ర హోంమంత్రికి వ్యతిరేకంగా పలుచోట్ల బీజేపీయేతర పార్టీల నిరసన

8

గ్రానైట్‌కు గడ్డుకాలం

- జిల్లాలో 70శాతం ఫ్యాక్టరీలు మూత
- 200 నుంచి 40కి పడిపోయిన క్వారీలు
- కఠినంగా మారిన క్వారీ లీజు నిబంధనలు
- 40 శాతం సబ్సిడీ ఎత్తేయడంతో తీవ్ర ఆర్థిక భారం
- ప్రభుత్వం ఆదుకోకపోతే యూనిట్లన్నీ మూతే
- తాత్కాలిక పర్మిట్‌లు ఇచ్చి ఆదుకోవాలని యాజమాన్యాల వేడుకోలు



ఖమ్మం ఖానాపురం హవేలీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అసలే కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్న గ్రానైట్ పరిశ్రమకు ప్రభుత్వ నిర్ణయాలు శరాఘాతంగా మారాయి. రాయల్టీ మీద రిబేటును రాష్ట్ర ప్రభుత్వం తొలగించడంతో పాటు స్లాబ్ ఒక్కో కట్టర్‌కు రూ.10,816 ఉన్న రాయల్టీని రూ.20,560కు పెంచింది. దీంతో పరిశ్రమ యజమానులు ప్రభుత్వానికి పలు దఫాలు వినతిపత్రాలు అందించగా ప్రస్తుతం రూ రూ.14,040గా సవరించింది. కానీ అది ఇంకా అమల్లోకి రాలేదని తెలిసింది. పరిశ్రమలు బ్యాంకు రుణాలను కూడా సకాలంలో చెల్లించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం రాయల్టీపై 40శాతం సబ్సిడీని ఎత్తివేయటంతో పరిశ్రమలపై తీవ్ర ప్రభావం పడి పరిశ్రమలు మూతపడటంతో పాటు అటు పారిశ్రామికవేత్తలతో వాటిపై ఆధారపడి బతికే వేతన జీవులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఒక్క ఖమ్మం జిల్లాలోనే 70శాతం పరిశ్రమలు మూతపడటానికి సిద్ధంగా ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముడి మెటీరియల్ సమస్యతో పాటు, ఫినిషింగ్ చేసిన మెటీరియల్‌కు సరైన ధర లేక, కొనే బయ్యర్లు లేకపోవడంతో నిల్వలు పెరిగిపోయాయి. ఈ సమయంలోనే ప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమకు గతంలో ఉన్న 40శాతం రాయల్టీ సబ్సిడీని ఎత్తేయడంతో పరిస్థితులు మరింత భారంగా మారాయి. ప్రస్తుతం జిల్లాలో 400 పరిశ్రమలు నడుస్తుండగా స్లాబ్ సిస్టంలో రాయల్టీ మొత్తం చెల్లించాల్సి రావడంతో మరికొన్ని పరిశ్రమలు మూతపడే అవకాశం ఉంది.

ఒక్కో పరిశ్రమపై నెలకు రూ.27వేల భారం

రాష్ట్ర ప్రభుత్వం రాయల్టీపై 40శాతం సబ్సిడీని ఎత్తివేయటంతో జిల్లాలోని సుమారు 450 స్లాబ్, 120 టైల్స్ గ్రానైట్ పరిశ్రమలపై తీవ్ర ఆర్థిక భారం పడనుంది. గతంలో నాలుగు కట్టర్లు ఉన్న స్లాబ్ గ్రానైట్ పరిశ్రమ యజమానులు నెలకు రాయల్టీతో పాటు టాక్స్‌లు కలిపి రూ.43,264 చెల్లించేవారు. కానీ ప్రస్తుతం సబ్సిడీ ఎత్తివేయటంతో రూ.71వేల, 4రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఒక్కో పరిశ్రమపై నెలకు సుమారు (మిగతా 6వ పేజీలో)



విద్యార్థులతో కలిసి అల్పాహారం తింటున్న ఉపసంచాలకులు కస్తాల సత్యనారాయణ

ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో
మోడల్ స్టోర్‌లు

- నూతన మెనూ మేరకు వసతిగృహ విద్యార్థులకు ఆహారం
- ఎస్సీ సంక్షేమ బాలికలతో కలిసి అల్పాహారం తిన్న డీడీ సత్యనారాయణ

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశాల మేరకు రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా జిల్లాలోని 52 ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో మోడల్ స్టోర్‌లు, నూతన ఆహార మెనూ ఏర్పాటుకు కావాల్సిన కొత్త వంట పాత్రలను సంక్షేమ వసతిగృహాలకు పంపిణీ చేసినట్టు సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు కస్తాల సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఖమ్మంలోని ఎస్సీ బాలికల బీ వసతిగృహంలో మోడల్ స్టోర్ నిర్మాణాన్ని డీడీ కస్తాల పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నూతన మెను అమలు చేయాలంటూ కొత్త వంట పాత్రలు అవసరం ఏర్పడిందన్నారు. ప్రతి సంక్షేమ వసతిగృహంలో మోడల్ స్టోర్‌ను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. విద్యార్థులకు శీతాకాలం దృష్ట్యా ఇప్పటికే కావాల్సిన ఉన్ని వస్త్రాలను పంపిణీ చేశామని, నూరుశాతం నూతన మెనూ అమలు చేసేందుకు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. సంక్షేమాధికారి విజయ పాల్గొన్నారు.

సింగరేణి ఆవిర్భావ వేడుకలకు
ప్రకాశంస్టేడియం ముస్తాబు

- నేడు హాజరుకానున్న సింగరేణి సీఎండీ బలరాం
- సినీ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు

రుద్రంపూర్, (సింగరేణి) డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ఆవిర్భావ దినోత్సవానికి ప్రకాశంస్టేడియం ముస్తాబైంది. సోమవారం నిర్వహించే ఆవిర్భావ వేడుకలకు సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.బలరాం హాజరుకానున్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి ప్రధాన కార్యాలయంతోపాటు ప్రకాశం గ్రౌండ్‌లో సింగరేణి జెండాను ఆవిష్కరించనున్నారు. ప్రధాన కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటరులోని తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు 2కె రన్‌ను నిర్వహించనున్నారు. అనంతరం సింగరేణి సెక్యూరిటి సిబ్బందిచే గౌరవవందనం స్వీకరించిన అనంతరం ప్రభుత్వ సింగరేణి పాఠశాల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం సినీ, టీవీ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రముఖ సినీగాయకుడు ధనుంజయ్, ప్రణతీ, శృతిక సినీసంగీత విభావరి, ప్రముఖ శాస్త్రీ నృత్యకారిణి సీతా ప్రసాద్ బృందంచే నృత్య ప్రదర్శన, బాబీ టీం ఆధ్వర్యంలో మ్యూజిక్ షో, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు జనార్ధన్‌చే మిమిక్రీ తదితర కళా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. 136 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి బొగ్గు ఉత్పత్తితోపాటు థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి రంగాల్లో ప్రవేశించింది. సింగరేణిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, కార్మికులకు సంబంధించిన స్టాల్స్‌ను అధికారులు ప్రకాశంగ్రౌండ్‌లో ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా సింగరేణి భూగర్భ బావులు, ఓపన్‌కాస్టు మైన్‌లో బొగ్గు ఉత్పత్తి, బొగ్గు అన్వేషణ కోసం ఎక్స్‌ప్లోరేషన్ అధికారులు, కార్మికులు నిర్వహించే విధులకు సంబంధించి స్టాల్స్‌లో ప్రదర్శనలు చేపట్టనున్నారు. ఆవిర్భావ దినోత్సవానికి మూడు రోజుల నుంచే సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో క్విజ్, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. సింగరేణి సివిల్, పర్సనల్, వెల్ఫేర్, కమ్యూనికేషన్ తదితర విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలంటూ సింగరేణి కార్మిక ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు.



ముస్తాబైన సింగరేణి ప్రకాశం గ్రౌండ్





ప్రకాశం గ్రౌండ్‌లో స్టాల్స్‌ను ఏర్పాటు చేసిన దృశ్యం

సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఉత్తమ ఉద్యోగులు వీరే..

సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలువుర్ని ఉత్తమ ఉద్యోగులు, కార్మికులుగా ఎంపిక చేశారు. కొత్తగూడెం ఏరియాలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరుగా పని చేస్తున్న అనుగోలు ప్రదీప్‌కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీరుగా పని చేస్తున్న దుర్గా ప్రసాద్‌ను అధికారులు ఎంపిక చేయగా చెన్నకేశవరావు, దొడ్డిపల్లి రమేష్‌ను ఉత్తమ కార్మికులుగా ఎంపిక చేసినట్లు అధికారులు ప్రకటించారు. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజరు షాలెంరాజు సోమవారం వీరికి అవార్డులను అందజేయనున్నారు.



కిరణ్‌కుమార్



హుస్సేన్

ఉమ్మడి జిల్లా మార్కెట్ ఉద్యోగుల కమిటీ ఎన్నిక

ఖమ్మం మార్కెట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఆదివారం నగరంలోని మార్కెట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీకి అధ్యక్షుడిగా తాడేపల్లి కిరణ్ కుమార్, కార్యదర్శిగా ఎండీ హిమాయత్‌హుస్సేన్, ట్రెజరర్‌గా బి.జగదీష్, గౌరవాధ్యక్షుడిగా రెంటాల ప్రసాద్‌తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ మూడేళ్లు పదవిలో కొనసాగనుంది. కార్యక్రమంలో మార్కెట్ ఉద్యోగులు రాజు, సాంబశివరావు, బాలాజీ, దినేష్, భాస్కర్, పీక్లా, పవన్, నాగేశ్వరి, వాసాల వెంకటేశ్వర్లు, విజయ, రామారావు, అనూష తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

విద్యుత్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఇనుగాల శ్రీధర్



మాట్లాడుతున్న ఇనుగాల శ్రీధర్

మధిర, డిసెంబరు 22: కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థను ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందని విద్యుత్ ఉద్యోగుల యూనియన్ (ఐఎన్‌టీయూసీ-327)రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఇనుగాల శ్రీధర్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని యూనియన్ పరంగా అడ్డుకుంటామని తెలిపారు. ఆదివారం మధిర రెడ్డి గార్డెన్స్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థను ప్రైవేటీకరించాలని కేంద్రం గతంలోనే ప్రయత్నించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో గట్టిగా ఎదురొడ్డి పోరాడతామని తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగులతోపాటు ఆర్టిజన్స్, అన్మాండ్ వర్కర్స్, ప్రైవేట్ కలెక్షన్ ఏజెంట్లు, స్పాట్ బిల్లింగ్ కార్మికులు సమస్యలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఆయన కూడా సానుకూలంగా ఉన్నారన్నారు. 1999 నుంచి 2004 మధ్య రిక్రూట్ అయిన ఉద్యోగుల సమస్య అయిన ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌కు మార్చేందుకు కృషి జరుగుతుందని తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో విశిష్ట అతిథులుగా గాదె మోహన్‌రెడ్డి, మందడపు శ్రీనివాసరావు, టీజీ ఎన్‌పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు టీ మహేందర్‌రెడ్డి, రీజినల్ సెక్రెటరీ సీతారాం గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైరా డివిజన్‌కు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.అధ్యక్షులుగా గాదె నర్సింహారెడ్డి, కార్యదర్శిగా ఎం.వెంకటేశ్వరరావు, ట్రెజరర్‌గా హుస్సేన్, కర్నాటి శ్రీనివాసరావు తదితరులు సభ్యులుగా ప్రకటించారు.

కళలను ప్రోత్సహించడం అభినందనీయం

సత్యహరిశ్చంద్ర పద్య పఠన పోటీల ముగింపు సభలో వక్తలు



మధిర, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తూ కళాసాంస్కృతిక వైభవాన్ని కొనసాగించడం అభినందనీయమని సత్యహరిశ్చంద్ర పద్యపఠన పోటీల ముగింపు సభలో పలువురు వక్తలు అన్నారు. ఆదివారం మధిర టీవీఎం హైస్కూల్‌లో సత్య హరిశ్చంద్ర నాటక రచయిత, కవి బలిజేపల్లి లక్ష్మీకాంతం 143వ జయంతిని పురస్కరించుకొని సుమిత్రయూత్, చందాల కేశవదాసు కళాపరిషత్ సంయుక్త నిర్వహణలో విద్యార్థులకు జిల్లాస్థాయిలో పద్యపఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం జరిగిన పోటీల ముగింపు సభలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కళారంగంను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు విశేషంగా సహకరిస్తున్నారని తెలిపారు.

విజేతలు వీరే... : సీనియర్స్ విభాగంలో పీ.పుల్లారావు (హరిజనవాడ స్కూల్, మధిర)ప్రథమ, ఆర్ లీల, ఎస్ ప్రణవి (సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్) ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. జూనియర్స్ విభాగంలో ఏ తపస్వీ, జీ జాహ్నవి (భరత్ స్కూల్) ప్రథమ, ద్వితీయ, ఎం శృతి (హరిజనవాడ స్కూల్) తృతీయ, సబ్ జూనియర్స్ విభాగంలో రిత్విక్ హుసన్, కార్తీ నయన్, అన్విత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ముఖ్యఅతిథులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సుమిత్ర యూత్ అధ్యక్షుడు పబ్బతి రాంబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి నిభానుపూడి సుబ్బరాజు, కేశవదాసు కళాపరిషత్ అధ్యక్షుడు కొండపల్లి జగన్మోహన్‌రావు, బొల్లెద్దు రాజేందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా జి.వెంకటేశ్వరరావు, చిలువేరు శాంతయ్య వ్యవహరించారు.

పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించాలి..

ఎలక్ట్రోల్ అబ్జర్వర్ బాలమాయాదేవి

కొత్తగూడెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :క్షేత్రస్థాయిలో షెడ్యూల్‌ప్రకారం ఎన్నికల విధులు నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న ఫారం 6,7,8లను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించాలని ఎలక్ట్రోల్ అబ్జర్వర్ బాలమాయాదేవి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి ఆమె స్పెషల్ సమ్మరీ రివిజన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు వచ్చిన ఎలక్ట్రోల్ అబ్జర్వర్ బాలామాయాదేవికి కలెక్టర్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఆమెకు జిల్లాలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ ఐడీ కార్డుల జారీ, పోలింగ్ కేంద్రాల్లో చేసిన ఏర్పా ట్లు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, తహసీల్దార్లు, ఎలక్షన్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి.. సిరులవేణి

(5వ పేజీ తరువాయి)

కార్మికుల్లో అనేకమంది మద్యానికి బానిసలు కావడంతో వారి కుటుంబాలు చిన్నాభిన్నమయ్యేవి. కానీ నేడు సింగరేణి ఆ పరిస్థితిని అధిగమించింది. 2008నుంచి బ్యాంకుల ద్వారా వేతనాలను పంపిణీ చేస్తూ మద్యం వంటి వ్యసనాలు, ఇతర మోసాలకు బలి కాకుండా అవగహన కల్పిస్తున్నారు. గత దశాబ్ధ కాలంలో డిపెండెంట్ కారుణ్య నియామకాల వల్ల సుమారు 23వేల మంది విద్యావంతులు సింగరేణి ఉద్యోగాల్లో చేరారు. విద్యావంతులైన ఉద్యోగులు, ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగంతో సింగరేణి గత 26 ఏళ్లుగా లాభాలు గడిస్తోంది. గతంతో పోల్చితే కార్మికుల సంఖ్య తగ్గుతున్నా ఉత్పత్తి లక్ష్యాలు పెరుగుతున్నా వెనుకంజ వేయకుండా సవాళ్లను అధిగమిస్తోంది. అటవీశాఖ క్లియరెన్స్‌లు సకాలంలో లభించకపోవడంతో ఇల్లెందు తదితర ప్రాంతాల్లో గనుల విస్తరణ నిలిచిపోయింది.

బహుముఖ విస్తరణకు ప్రణాళికలు

సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తికే పరిమిత కాకుండా బహుముఖ విస్తరణ కోసం ప్రణాళికలు చేపట్టింది. పదేళ్ల క్రితమే సింగరేణి వ్యాపార రంగంలో అడుగుపెట్టింది. అందులో భాగంగా మంచిర్యాల జిల్లా జైపూర్ ప్రాంతంలో 1,200మెగావాట్ల సామర్థ్యంతో థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించింది ఈ క్రమంలో మరో అడుగు ముందుకేసి 500మెగావాట్ల సమర్థ్యంతో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, భూపలపల్లి, మంచిర్యాల తదితర ఏరియాల్లో సోలార్ ప్లాంట్లను నిర్మించారు. ఇంతటితో ఆగకుండా ఇల్లెందు, రామగుండం ఏరియాల్లో 600మెగావాట్ల సామర్థ్యంతో పంప్‌స్టోరేజ్ ఐడల్ ప్రాజెక్టు నిర్మించనుంది. మందమర్రి ఏరియాలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థను ఏర్పాటుచేయనుంది. అంతే కాకుండా థర్మల్ పవర్‌స్టేషన్‌లో ఉప ఉత్పత్తిగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని సైతం ప్రారంభించింది. అక్కడే కార్బన్‌డయాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీకి సన్నాహాలు చేస్తోంది. మణుగూరు ఏరియాలో ఉన్న వేడినీటి ఊటల ద్వారా జీయో విద్యుత్ ఉత్పత్తికి ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ న్యాచురల్ గ్యాస్ కంపెనీ) సహకారంతో ప్రయత్నాలు చేపట్టింది. అంతే కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని బొగ్గు ద్వారా అమోనియం నైట్రేట్ తాయారీపై సింగరేణి ఫోకస్ పెట్టింది. లిథియం మైనింగ్‌పై దృష్టి పెట్టనుంది. అన్ని ఏరియాల్లో పెట్రోల్ బంకులను ప్రారంభించనుంది. అలాగే రాజస్థాన్‌లో సోలార్ పవర్‌ప్లాంట్ స్థాపనపై కూడా సింగరేణి ఆసక్తి చూపుతోంది.

కార్మిక సంక్షేమానికి పెద్దపీట

సింగరేణి సంస్థ వ్యాపారంతో పాటు కార్మికులు, ఉద్యోగులు సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. రామగుండం, కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రుల్లో సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలను అందించేందుకు కృషిచేస్తోంది. సింగరేణి ప్రాంతాల్లో విద్యావ్యవస్థను అభివృద్ధికి వచ్చే ఏడాది నుంచి రామగుండం-2, సెక్టారు-3, పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రారంభించనున్నారు. లాభాల వాటాల చెల్లింపుల్లో భాగంగా కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల వంతున బోనస్ చెల్లింపుతో పాటు రూ.30లక్షల వరకు ప్రమాద బీమాను అందిస్తున్నారు. కార్మికుల కోసం కొత్తగా క్వార్టర్స్ నిర్మిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో స్థానికులకు 80శాతం రిజర్వేషన్ కల్పించారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లను ఏర్పాటు చేశారు. రాజీవ్‌గాంధీ సివిల్ అభయ హస్తం ద్వారా ఏటా 140మంది సింగరేణి పిల్లల చదువులకు రూ.1లక్ష వంతున ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. ఇంకా అనేక కార్యక్రమాలతో సింగరేణి సంస్థ కార్మికుల అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలుస్తోంది.

స్థానిక సమరానికి సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

భద్రపరుస్తున్నారు. ఇతరులెవరూ ఆయా గోదాముల్లోకి వెళ్లకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణ కొనసాగుతోంది. ఒక్కో వార్డుకు ఒక బ్యాలెట్ పెట్టెను వినియోగించనున్నట్లు సమాచారం. జిల్లాలో మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలను నిర్వహించడానికి ప్రణాళికలను కూడా సిద్ధం చేశారు. ఒక చోట వినియోగించిన బ్యాలెట్ పెట్టెలకు మరో చోట వినియోగించే అవకాశం ఉంది. ఇలా స్థానిక సంస్థలకు ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు ఉండగా గ్రామాల్లోనూ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. మొదటి విడతలో ఎన్నికలు 193 జీపీలు, 1,795 వార్డులకు, రెండో విడతలో ఎన్నికలు204 జీపీలు, 1,862 వార్డులకు, మూడో విడతలో ఎన్నికలు 192 జీపీలు, 1,740 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు.

జిల్లా పంచాయతీ ఎన్నికల వివరాలు ఇలా

మొత్తం పంచాయతీలు	: 589
వార్డులు	: 5398
పోలింగ్ కేంద్రాలు	: 5438
మొత్తం ఓటర్లు	: 8,64,702
పురుషులు	: 4,18,151
మహిళలు	: 4,46,527
థర్డ్ జెండర్లు	: 24

నోడల్ అధికారులు వీరే

ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిర్వహణ సన్యాసయ్య(డీఆర్డీవో), పరిశీలకులు సీహెచ్ శ్రీనివాసరావు(అడిషనల్‌పీడీ, డీఆర్డీవో), ఎన్నికల సిబ్బంది నిర్వహణ సోమశేఖర్‌శర్మ(డీఈవో), బ్యాలెట్ బాక్సుల నిర్వహణ ఆర్. ఆశాలత(డీఎల్‌పీవో), రవాణా నిర్వహణ ఎం. వెంకటరమణ (ఆర్డీవో), శిక్షణ కార్యక్రమాలు ఎస్. మాధవి జిల్లా ఉపాధికల్పన అధికారి, ఎన్నికల సామగ్రి నిర్వహణ రాంబాబు(డివిజనల్ పంచాయతీ అధికారి), ఖర్చు పర్యవేక్షణ పరిశీలకులు గంగాధర్(జిల్లా కో-ఆపరేటివ్ అధికారి), బ్యాలెట్ పేపర్ బాధ్యత బి. శిరీష(అడిషనల్ డీఆర్డీవో), మీడియా కమ్యునికేషన్ గౌస్(జిల్లా పౌరసంబంధాల అధికారి), హెల్ప్‌లైన్ ఫిర్యాదుల విభాగం ఏ. శ్రీనివాస్(సీపీవో ఖమ్మం), రిపోర్టులు, రిటర్న్‌లు ఆర్. ఆశాలత(జిల్లా పంచాయతీ అధికారి).

విద్యుత్‌శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

- 15 మంది నుంచి రూ.1.76 కోట్లు వసూలు
- ఇద్దరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ 15 మంది వద్ద నుంచి రూ.1.76 కోట్లు వసూలు చేసి, ఘరానా మోసానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య ఆదివారం తెలిపారు. రూరల్ సీఐ సర్వయ్య తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మొగిలిచర్ల గ్రామానికి చెందిన ఇరుకుపాటి నాగేశ్వర్‌రావు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. హన్మకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన మండల సహోదర్‌రెడ్డి హైదరాబాద్ రామంతాపూర్ మేడ్చల్‌లో ప్రైవేట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. వీరిరువురు కలిసి జిల్లాలోని మహబూబాబాద్ టౌన్, రూరల్, కురవి, బయ్యారం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 15 మంది వ్యక్తుల వద్ద నుంచి విద్యుత్‌శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ గత రెండేళ్ల క్రితం రూ.1.76 కోట్లు వసూలు చేశారు. నాటి నుంచి నేటి వరకు బాధితులకు ఉద్యోగాలు ఇప్పించకుండా తప్పించుకుంటూ తిరుగుతున్నారు.

బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఇరుకులపాటి నాగేశ్వర్‌రావు, మండల సహోదర్‌రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సర్వయ్య తెలిపారు. ఈ కేసును ఛేదించి, వారిద్దరిని చాకచక్యంగా పట్టుకున్న రూరల్ సీఐ సర్వయ్య, టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సైలు దీపికరెడ్డి, విజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు సుధీర్, గణపతిలను ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అభినందించారు.

గ్రానైట్‌కు గడ్డుకాలం

(5వ పేజీ తరువాయి)

రూ.27వేల అదనపు భారం పడనున్నది. జిల్లా వ్యాప్తంగా నెలకు రూ.కోటి 80లక్షల వరకు అదనపు భారం పడనున్నది. సంవత్సరానికి సుమారు రూ.13కోట్ల వరకు అదనపు భారం పడనుంది. జిల్లాలో గతంలో 200 టైల్స్ పరిశ్రమలు నడిచేవి. కానీ ప్రస్తుతం 120 మాత్రమే నడుస్తున్నాయి. ఒక్కో పరిశ్రమపై నెలకు 8 వేల అదనపు భారం పడనున్నది. సంవత్సరానికి రూ.కోటి, 20లక్షల అదనపు భారం పడనుంది.

40కి పడిపోయిన క్వారీల సంఖ్య..

గ్రానైట్‌కు కేంద్ర బిందువుగా ఉన్న ఖమ్మం జిల్లాలో గతంలో తవ్వకాలు, ఎగుమతులతో ఎంతో సందడి ఉండేది. లక్షాలాది మంది కార్మికులకు ఉపాధి లభించేది. కానీ కాలక్రమేణా తవ్వకాలు తగ్గిపోవడంతో ఆ ప్రభావం స్థానిక అభివృద్ధిపై పడటంతో పాటు ఉపాధి అవకాశాలు లేక కార్మికులు ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. 2000 సంవత్సరానికి ముందు ఖమ్మం జిల్లాలో 200క్వారీలకు పైగా ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 40కు పడిపోయింది. ప్రభుత్వ ఆధీనంలోని 188.43 హెక్టార్ల భూమి, 148.928 హెక్టార్ల పట్టాదారు(ప్రైవేట్) భూమిలో క్వారీలు నడిచేవి. కానీ ప్రస్తుతం ప్రభుత్వ ప్రైవేట్ కలిపి మొత్తం 100హెక్టార్లలో మాత్రమే గ్రానైట్ లీజులు నడుస్తున్నాయి. అంటే మొత్తం మూడు వంతుల్లో రెండు వంతుల వ్యాపారం తగ్గిపోగా, 214 హెక్టార్ల భూమిలో గ్రానైట్ తవ్వకాలు నిలిచిపోయాయి.


అనుమతులు రద్దు

పల్లెప్రకృతి వనాలు, పేదలకు ఇళ్ల ప్లాట్లు, డబుల్ బెడ్రూంలకు, వివిధ ప్రభుత్వ భవనాలకు భూములు కేటాయించిన కారణంగా వందల సంఖ్యలో గ్రానైట్ క్వారీలకు ప్రభుత్వం అనుమతులు రద్దు చేసింది. క్వారీ లీజుల విషయంలోనూ ప్రభుత్వ నిబంధనలతో పాటు పర్యావరణ అనుమతులను తప్పనిసరి చేస్తూ జీవోలు తీసుకురావడంతో క్వారీ లీజులు ఏళ్లతరబడి దరఖాస్తుల దశలోనే మిగిలిపోతున్నాయి. గతంలో గ్రానైట్ క్వారీలకు పర్యావరణ అనుమతులతో సంబంధం లేకుండానే లీజులు ఇచ్చేవారు.

కానీ ప్రస్తుతం క్వారీలకు కూడా పర్యావరణ అనుమతులు తప్పనిసరి చేయడంతో యజమానులు అనుమతుల కోసం ఏళ్ల కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా దరఖాస్తు చేసుకున్న ఆరునెలలోపు గ్రానైట్ క్వారీలకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని యాజమాన్యాలు కోరుతున్నాయి. గ్రానైట్ రాయితీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వద్ద 1,224 పెండింగ్ ఫైళ్లు ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తే గ్రానైట్ ఫ్యాక్టరీలకు రూ.23కోట్ల 48లక్షల 66వేల 196 రాయితీ రూపంలో ఊరట కలుగుతుంది.

గ్రానైట్ లీజులు ఆలస్యంతో ఆర్థిక భారం

పాటిబండ్ల యుగంధర్, జిల్లా గ్రానైట్, స్లాబ్ అసోసియేషన్ అధ్యక్షుడు



గ్రానైట్ క్వారీ లీజుల ఆలస్యంతో ఆర్థిక భారం పడుతోంది. గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు రోజుకో కొత్త జీవో తీసుకొచ్చి పరిశ్రమను ఇబ్బందులకు గరిచేస్తున్నాయి. ప్రస్తుతం ఒక హెక్టారు పట్టా భూమికి లీజు దరఖాస్తు చేయాలంటే రూ.30లక్షల ఖర్చవుతోంది. లీజు దరఖాస్తు నుంచి గ్రాంట్ వరకు సుమారు రెండు సంవత్సరాల సమయం పడుతుంది. పరిశ్రమ మనుగడకు ముడిసరుకు సంబంధించి లీజులు సరళీకృతం చేసి వెంటనే లీజులు వచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలి.


పట్టాదారే లీజు దరఖాస్తుకు అర్హుడు

రావూరి సాయినాథ్, జిల్లా గనులు, భూగర్భశాఖ అసిస్టెంట్ డైరెక్టర్



గ్రానైట్ క్వారీ లీజులకు పట్టాదారు పాసు పుస్తకం ఉండి ధరణిలో పేరు నమోదైన వ్యక్తే అర్హుడు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ఫీజు చెల్లించి ఎన్‌ఓసీ, మైనింగ్ ప్లాన్, ఈసీ ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలి. అనంతరం లీజు గ్రాంట్ ఆర్డర్ కాపీలు అందిస్తాం. పట్టా భూములకే లీజులు మంజూరు చేస్తాం. ప్రభుత్వ భూముల్లో గ్రానైట్ లీజు ఆక్షన్‌లో కేటాయిస్తారు. జిల్లాలో ప్రస్తుతం 2023, 24 సంవత్సరాల్లో పట్టా భూములకు వచ్చిన దరఖాస్తులు నాలుగు లీజులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్నాయి.

ఇచ్చిన హామీలను మర్చిపోను



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

(5వ పేజీ తరువాయి)

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామన్నారు. గృహనిర్మాణశాఖ మంత్రి కూడా జిల్లా వారే కావటం మనకు కలిసి వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ దశల వారీగా అమలు చేస్తున్నామని మంత్రి తుమ్మల వివరించారు. సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందకపోతే స్థానిక కార్పొరేటర్‌ల ద్వారా అందేలా చూస్తామన్నారు. ఖమ్మం ఖిల్లా అభివృద్ధికి కార్యచరణ పూర్తయ్యిందని, ఖిల్లాకు రూ.20కోట్లతో రోప్‌వే ఏర్పాటు చేస్తామన్నారు. డివిజన్లు వారీగా రహదారులు, డ్రైనేజీలకు రూ.100కోట్లు మంజూరు చేశామన్నారు. పట్టణ ప్రణాళిక, పారిశుధ్య విభాగాలు బాధ్యతగా పనిచేయాలని, అక్రమ కట్టడాలను పునాదుల స్థాయిలోనే అడ్డుకోవాలని ఆదేశించారు. లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల హెచ్చరించారు.

నగరంలో పారిశుధ్యం ఇంకా మెరుగుపడాల్సి ఉందన్నారు. ఎంపీ రఘురామరెడ్డి మాట్లాడుతూ ఖమ్మం నగరం అభివృద్ధికి తనవంతు నిధులు కేటాయిస్తామన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంజూరు చేసిన నిధులు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ అభిషేక్ ఆగస్త్య, కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, రాపర్తి శరత్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు సాదు రమేశ్‌రెడ్డి, మెక్కా శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎస్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీడీవోల సంఘం రాష్ట్ర నేతలు

ఎంపీడీవోల అర్తనాదాలు..

- ఒత్తిడితో ప్రాణాలు కోల్పోతున్న అధికారులు
- పెండింగ్‌లో ఉన్న అలవెన్సులు
- కానరాని ప్రమోషన్ల ప్రక్రియ
- సెలవుల కోసం కూడా కలెక్టర్‌ను కలవాల్సిందే..
- సీఎస్‌ను కలిసిన సంఘం రాష్ట్ర నాయకులు

మణుగూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమా స్పందించు.. ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రాణాలు పోయాయి.. ఇంకా ఎన్ని మరణాలు జరగాలి.. సమస్యలు ఓ పక్క, మరోపక్క తీవ్ర ఒత్తిడికి గురై మండలాభివృద్ధి అధికారులు ఒక్కొక్కరిగా ప్రాణాలు విడుస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని మండల అభివృద్ధి అధికారుల రాష్ట్రసంఘం అధ్యక్షుడు ఏకంగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి వినతి పత్రాన్ని అందించారంటే వియషం ఎంత జఠిలంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలోని మండలపరిషత్ అభివృద్ధి విభాగంలో పనిచేసే అధికారుల దీనావస్థపై రాష్ట్ర సంఘమే చలించి చీఫ్ సెక్రటరీ వరకు విషయాన్ని తీసుకెళ్లిందంటే తీవ్రతను అవగతం చేసుకోవచ్చు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యల కారణంగా ఎంపీడీవోలు సతమతం అవుతున్నారు. ఎన్నికల బదిలీల అనంతరం గుండెపోటు వల్ల తొమ్మిది మంది ఎంపీడీవోలు చనిపోతే, గడిచిన 15 రోజుల్లో మరో నలుగురు మృతిచెందారు. ప్రధానంగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీలను తిరిగి వారి జిల్లాలకు పంపకుండా ఐదు నెలలుగా పలు రకాల పాలనపరమైన అభ్యంతరాలను వ్యక్తం చేస్తుండటంతో ఎంపీడీవోలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవున్నారు. ఎంపీడీవోలకు ఇచ్చే వాహన అలవెన్స్‌లు రెండేళ్లగా విడుదల చేయలేదు. డ్రైవర్ జీతాలు, ప్యూయల్ చార్జీలు, అద్దెల వంటి పలు అంశాలు వారిని తీవ్రంగా కుంగదీస్తున్నాయి.

పదోన్నతులు ఎక్కడ..?

20 ఏళ్లుగా ఒకే పదవిలో కొనసాగుతున్నా ప్రమోషన్లు ఇవ్వడం లేదు. ఇది చాలా దురదృష్టకరమైన విషయమని సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలు ఒక్కరే చూసినా పంచాయతీ రాజ్ డిపార్టుమెంట్ నుంచి పనిచేసే ఎంపీడీవోలు సహాయ ప్రాజెక్టు అధికారులుగా డీఆర్‌డీఏలో పనిచేయాలంటే దానికి ఫారిన్ సర్వీస్ నియమాలను అన్వయించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌ను కలవాల్సిందే...

ప్రభుత్వ నిబంధనలను అనుసరించి మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు సెలవు మంజూరు చేసే అధికారం జడ్పీ సీఈవోలకు మాత్రమే ఉంది. కానీ ఎటువంటి ఉత్తర్వులు లేకుండానే ఆ అధికారాలను జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు తీసుకున్నారు. దీంతో ప్రతి చిన్న అంశానికి సెలవు కొరకు జిల్లా కలెక్టర్‌ను కలవాల్సి వస్తోంది. కలెక్టర్లు సరైన సమయంలో సరిగా స్పందించని కారణంగా వారు ఉన్నటువంటి అత్యవసర కార్యక్రమాలను కూడా వాయిదా వేసుకోవడం కలచివేస్తోందని ఎంపీడీవోలు భావిస్తున్నారు.

ఇన్ని సమస్యలతో సతమతం అవుతున్న తమకు తగిన పరిష్కారాన్ని చూపాలని రాష్ట్ర ఎంపీడీవోల సంఘం అధ్యక్షుడు తేళ్లూరి శ్రీనివాసరావు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతి పత్రాన్ని కూడా అందజేశారు.

కనీస గౌరవం కరవు...

తమ డిపార్టుమెంట్‌కు సంబంధం లేకపోయినా సమగ్ర కుటుంబ సర్వే, ఇందిరమ్మ సర్వే, అమ్మ ఆదర్శ పాఠశాల్లో పనులు చేయించడం, సీఎం కప్ క్రీడలు వంటి అదనపు బాధ్యతల నిర్వహణ ఎంపీడీవోలపై పడుతోంది. ప్రభుత్వం ఎంచుకున్న ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాంలను అత్యంత విజయవంతంగా నిర్వహిస్తున్నా తమకు కనీస గౌరవం కూడా దక్కడం లేదన్న ఆవేదన ఎంపీడీవోల్లో నెలకొంది. వెంటనే బదిలీలు జరపాలని, రెండేళ్లగా పెండింగ్‌లో ఉన్న వాహన అలవెన్స్ ఇప్పించాలని, ప్రమోషన్ ప్రక్రిను వేగవంతం చేసి పదోన్నతులు కల్పించాలని ఎంపీడీవోలు డిమాండ్ చేస్తున్నారు. రూరల్ డెవలప్‌మెంట్‌లో పనిచేసే ఎంపీడీవోలకు ఓడీ సౌకర్యం కల్పించాలని, సెలవులు కలెక్టర్ కాకుండా సీఈవోలు మంజూరు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని వారు కోరుతున్నారు.

సమగ్ర అభివృద్ధి కోసం పోరాటాలు

- జిల్లాపై ముగ్గురు మంత్రులది వివక్షపూరిత వైఖరి
- ప్రజా సమస్యలపై మహాసభలో పలు తీర్మానాల ఆమోదం
- సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

కొత్తగూడెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కానున్నట్లు సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం మంచికంటిభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండురోజులపాటు ఇల్లెందు పట్టణంలో జరిగిన జిల్లా మహాసభలో ప్రజా సమస్యలపై ఆమోదించిన తీర్మానాలు వెల్లడించారు. జిల్లా మహాసభలో గత మూడు సంవత్సరాల కాలంలో ప్రజా సమస్యలపై సీపీఎం నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాలు సమీక్షించుకుని భవిష్యత్‌లో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అవసరమైన పోరాటాల రూపకల్పన చేశామని అన్నారు.

జిల్లా అభివృద్ధి పట్ల ముగ్గురుమంత్రులు వివక్ష చూపుతున్నారని, పేరుకే రెండు జిల్లాలు రెండు కళ్ల లాంటివి అనే మాటలతో మభ్య పెడుతున్నారని అన్నారు. పోడుసాగుదారులకు గత ప్రభుత్వం ఇచ్చిన హక్కుపత్రాలు కొద్ది మందికి మాత్రమే వచ్చాయని, భూమి మీద సాగులో ఉన్న ప్రతి ఒక్కరికి హక్కుపత్రాలు ఇచ్చే వరకు పోరాడుతామని అన్నారు.

పాల్వంచ, మణుగూరు మునిసిపాలిటీలకు సారపాక, భద్రాచలం పంచాయతీలకు ఎన్నికలు జరిపి ప్రజాపాలన అందించాలని మహాసభలో తీర్మానం చేసినట్లు తెలిపారు. జిల్లాలో వైద్యరంగంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని డాక్టర్, నర్సింగ్ పోస్టులు, ల్యాబ్ సౌకర్యాలు కల్పించి ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్యసేవల అందించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో 34 మందితో జిల్లాకమిటీ, 11 మందితో కార్యదర్శివర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్రకమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం. జ్యోతి, లిక్కి బాలరాజు, కె. బ్రహ్మచారి, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, జిల్లాకమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, జిలకర పద్మ, భూక్య రమేష్ పాల్గొన్నారు.

నేటినుంచి పలు రైళ్ల రద్దు



ఖమ్మం మామిళ్లగూడెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం మోటమర్రి రైల్వే స్టేషన్ సమీపంలో మూడో రైల్వేలైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఖమ్మం స్టేషన్ మీదుగా విజయవాడ, సికింద్రాబాద్ మధ్య నడిచే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం ప్రకటించారు. ఖాజీపేట- విజయవాడ రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం నుంచి జనవరి 10 వరకు ఖమ్మం రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే కొన్ని సర్వీసులను పూర్తిగా రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేసినట్లు ఖమ్మం రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ. జాఫర్ ఖాన్ తెలిపారు.

రద్దయిన రైళ్ల వివరాలు..

రైలు సంఖ్య	పేరు	రద్దయిన రోజులు
07755	డోర్నకల్-విజయవాడ	25 నుంచి జనవరి 9 వరకు
07756	విజయవాడ-డోర్నకల్	25 నుంచి జనవరి 9 వరకు
07979	విజయవాడ- భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్	25 నుంచి జనవరి 9 వరకు
07278	భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్ (బీడీసీఆర్)-విజయవాడ	25 నుంచి జనవరి 9 వరకు
12705	గుంటూరు-సికింద్రాబాద్	28,29, జనవరి 2,5,7,8,9
12706	సికింద్రాబాద్-గుంటూరు	28,29, జనవరి 2,5,7,8,9
12713	విజయవాడ-సికింద్రాబాద్	27, జనవరి 1,4,7,8,9
12714	సికింద్రాబాద్-విజయవాడ	27, జనవరి 1,4,7,8,9
22646	కొచ్చివెల్లి-ఇండోర్	28, జనవరి 4
22645	ఇండోర్-కొచ్చివెల్లి	30, జనవరి 6
22648	కొచ్చివెల్లి-కోర్బా	26,30, జనవరి 2,6
22647	కోర్బా-కొచ్చివెల్లి	28,జనవరి 1,4,8
12511	గోరఖ్ పూర్-కొచ్చివెల్లి	26, జనవరి 3,5
12512	కొచ్చివెల్లి-గోరఖ్పూర్	31, జనవరి 7,8
12521	బరౌని-ఎర్నాకులం	23,30, జనవరి 6
12522	ఎర్నాకులం-బరౌని	27, జనవరి 3,10
06509	బెంగుళూరు-ధనపూర్	30, జనవరి 6
06510	ధనపూర్- బెంగుళూరు	జనవరి 1,8

గోల్కొండ ఎక్స్‌ప్రెస్ పాక్షికంగా రద్దు...

17201 నెంబరు గల గుంటూరు - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ గుంటూరు- ఖాజీపేట మధ్య ఈనెల 27 నుంచి జనవరి9 వరకు, 17202 నెంబరు గల సికింద్రాబాద్- గుంటూరు ఎక్స్‌ప్రెస్ ఖాజీపేట-గుంటూరు మధ్య ఈనెల 27 నుంచి జనవరి 9 వరకు పాక్షికంగా రద్దు చేశారు.

ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల క్రికెట్ జట్టు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం, భద్రాద్రి (ఉమ్మడి) జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అండర్-17 బాలికల జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు ఇరు జిల్లాల నుంచి సుమారు 42 మంది క్రీడాకారులు హాజరైనారు. ఈ సందర్భంగా ఎంపికల్లో ప్రతిభ చూపిన 20 మంది క్రీడాకారులను ప్రత్యేక శిక్షణ శిబిరానికి ఎంపిక చేశారు. శిక్షణ అనంతరం త్వరలో ఖమ్మం నగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే తుది జట్టును ఎంపిక చేయనున్నట్లు ఎజీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి తెలిపారు. శిక్షణ శిబిరానికి వైష్ణవి, అనన్య, ఝాన్సి, యశస్విని, యమున, నేహ, సాయిదీక్షిత, హిమవర్షిని, మాన్వి, గ్రీష్మ, వెన్నెల, శ్రీజ, రేవతి, శ్రీహర్షిత, యశస్వి, మనస్వి, మేఘన, నిఖితహెలెన్, గౌరీమంజలి, తాజ్‌అట్‌షాను ఎంపిక చేశారు. ఎంపికలను ఫిజికల్ డైరెక్టర్‌లు నరేష్, శ్రీనివాస్, సంపత్ తదితరులు సమీక్షించారు.

నగరంలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీలు

ఖమ్మంక్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా చూసేందుకు నగరంలోని పలు ప్రాంతాలలో శనివారం, ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ నిర్వహించినట్టు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి సేవించేందుకు అడ్డాలుగా చేసుకున్న పలు ప్రాంతాల్లో నిఘా పెట్టి ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. ఇకపై కూడా ఇలాంటి దాడులు కొనసాగుతాయని గంజాయి లాంటి మత్తుపదార్థాలను విక్రయించడం లాంటివి చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలో హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికను అలవాట్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

దేశానికి శాస్త్రవేత్తల అవసరం చాలా ఉంది

- డీఈవో సోమశేఖర శర్మ
- గురుదక్షిణ ఫౌండేషన్‌లో క్విజ్ పోటీల నిర్వహణ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈవో సోమశేఖర శర్మ

ఖమ్మం రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేశానికి శాస్త్రవేత్తల అవసరం చాలా ఉందని డీఈవో సోమశేఖర శర్మ అన్నారు. మండలంలో పోలేపల్లి పరిధిలోని గురుదక్షిణ ఫౌండేషన్‌లో ప్రముఖ గాంధేయవాది చేకూరి కాశయ్య, ఎస్‌వీ నారాయణ జ్ఞాపకార్థం, భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజం జన్మదినం పురస్కరించుకుని ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో సైన్సు క్విజ్ ను ఆదివారం నిర్వహించారు. ఈ క్విజ్ పోటీలకు మొత్తం 59 పాఠశాలల నుంచి 398 మంది విద్యార్థులు హాజరయ్యారు. 'నిత్య జీవితంలో సైన్స్' అనే అంశం మీద క్విజ్ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, జిల్లా సైన్స్ అధికారి జగదీశ్వర్ రావు క్విజ్ రాత పరీక్ష పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతు దేశానికి శాస్త్రవేత్తల అవసరం చాలా ఉందన్నారు. విద్యార్థులు వారికి నచ్చిన వృత్తిని ఎన్నుకోవాలని, పరిశోధనల రంగంలోకి విద్యార్థులు వెళ్లాలని అన్నారు. రాత పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరు ఉత్తమ జట్లకు క్విజ్ మాస్టర్ ధనుష్ రెడ్డి దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా ప్రొజెక్టర్ మీద రౌండ్లుగా ఫైనల్ క్విజ్ నిర్వహించారు. క్విజ్‌లో న్యూవిజన్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు ఉజ్వల్ క్రిష్ణ, అయాన్ అజాం అలీ ప్రథమ బహుమతి, గీతాంజలి విద్యాలయం కామేపల్లి విద్యార్థులు షేక్ సల్మా, లక్ష్మీనరసింహారావులు ద్వితీయ బహుమతి అందుకున్నారు. మల్లెమడుగు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు.

క్రైం సమాచారం

యువతిపై లైంగికదాడికి యత్నం..

పినపాక, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని యువతిపై లైంగికదాడి చేయబోయిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన పినపాక మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెగర్షల గ్రామానికి చెందిన తోట దుర్గయ్య అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మానసిక పరిపక్వత లేని 23 సంవత్సరాల యువతిపై శనివారం రాత్రి సమయంలో ఆమె ఇంట్లో ఎవరు లేని సమయంలో లైంగికదాడి చేయబోయాడు. ఈ క్రమంలో సదరు మహిళ కేకలు వేయడంతో దుర్గయ్య అక్కడి నుంచి పారిపోయాడు. ఈ సమయంలో అదే గ్రామానికి చెందిన ముక్కెర శ్రీను అనే వ్యక్తి ఇంట్లోకి ఎవరు రాకుండ కాపలా ఉన్నారన్నారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో సదరు మహిళ తండ్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

మహిళా కండక్టర్‌పై యువకుడి దాడి...

జూలూరుపాడు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మహిళా కండక్టర్‌పై ఓ యువకుడు చేయి చేసుకున్న సంఘటన జూలూరుపాడులో ఆదివారం చోటు చేసుకుంది. కొత్తగూడెం డిపోకు పల్లెవెలుగు (ఎయిర్) బస్సు కొత్తగూడెం నుంచి ఖమ్మం వెళుతోంది. జూలూరుపాడు స్టేజీ వద్ద బస్సు ఆపగా సుమారు 15 మంది ప్రయాణికులు ఎక్కారు. ఈ క్రమంలో బస్సు వెళుతుండగా పాపకొల్లు భీమ్లాతండా గ్రామానికి చెందిన బోడా అశోక్ తన ఇద్దరు పిల్లలతో కలసి బస్సు ఎక్కేందుకు ఆపాడు. డ్రైవర్ సుధాకర్ బస్సును పక్కకు ఆపుతున్న క్రమంలో సదరు యువకుడు తన ఇద్దరు పిల్లలతో కలసి రన్నింగ్‌లోనే బస్సు ఎక్కాడు. దీంతో మహిళ కండక్టర్ గొబ్బెల్ల సబిత బస్సును డ్రైవర్ పక్కకు నిలపకముందే రన్నింగ్‌లోనే పిల్లలతో కలసి బస్సు ఎందుకు ఎక్కావని అడిగారు. దీంతో యువకుడు కండక్టర్‌పై దుర్భాషలాడుతూ చెంప మీద కొట్టాడు. డ్రైవర్ బస్సును పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చాడు. మహిళా కండక్టర్ తనపై చేయిచేసుకున్న యువకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటో పల్టీ.. ఐదుగురికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అజయ్‌తండా వద్ద ఆదివారం సాయంత్రం ఆటో పల్టీ కొట్టిన సంఘటనలో నలుగురు మహిళలు, ఓచిన్నారి తీవ్రంగా గాయపడ్డారు. నేలకొండపల్లి నుంచి చెర్వుమాధారం వెళ్లటానికి నేలకొండపల్లిలో ఐదుగురు ప్రయాణికులు ఆటో ఎక్కారు. ఆటో అజయ్‌తండా వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న రాయిని ఎక్కించినట్లుగా సమాచారం. దీంతో ఒక్కసారిగా ఆటో పల్టీ కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఈశ్వరమ్మ, లక్ష్మి, ఉష, పద్మలకు తలకు తీవ్ర గాయాలైనాయి. ఆటోలోనే ఉన్న పాప సురేఖ ఎడమచేయి గూడ తొలిగింది. గాయపడిన వానికి చికిత్స కోసం ఖమ్మం తరలించారు.

వృద్ధుడిని బైక్‌తో ఢీకొట్టిన యువకులు

దుమ్ముగూడెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆటో దిగి రోడ్డు దాటుతున్న వృద్ధుడిని బైక్‌పై అతివేగంగా ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు ఢీకొట్టడంతో అతడి కాలు విరిగిన సంఘటన ఆదివారం నరసాపురంలో చోటుచేసుకుంది. నరసాపురం గ్రామానికి చెందిన కనుకు వెంకట్రామయ్య భద్రాచలం నుంచి ఆటోలో వచ్చి తన ఇంటికి వెళ్లేందుకు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిని దాటుతున్నాడు.

ఈ క్రమంలో చర్ల వైపు నుంచి బైక్‌పై వస్తున్న ముగ్గురు యువకులు వృద్ధుడిని ఢీకొట్టి కిందపడ్డారు. వృద్ధునికి కాలు విరగ్గా, యువకులకు సైతం స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో వృద్ధుడిని భద్రాచలం ఆసుపత్రికి తరలించారు.

ఫేస్‌బుక్ పరిచయంతో కుచ్చుటోపి

- రూ.16లక్షలు దండుకున్న మాయలేడి
- నిందితులను అరెస్ట్ చేసిన సైబర్‌క్రైం అధికారులు



ఖమ్మంక్రైం, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్ ద్వారా పరిచయం చేసుకుని నగదు కాజేసిన ఓ యువకుడుతో పాటు యువతిని అరెస్టు చేసినట్టు సైబర్‌క్రైం పోలీసులు ఆదివారం తెలిపారు. సైబర్‌క్రైంపోలీసుల కథనం ప్రకారం... విశాఖ జిల్లా పెందుర్తి మండలం నాయుడుతోట గ్రామానికి చెందిన వంకర లావణ్య అనే యువతి బ్యాంకు జాబ్‌కు కోచింగ్ తీసుకుంటోంది. అయితే కొద్దిరోజుల క్రితం సత్తుపల్లికి చెందిన ఓ వ్యక్తికి ఫేస్ బుక్ ద్వారా రిక్వెస్టుపెట్టి పరిచయం ఏర్పరుచుకున్నారు. కొద్దిరోజులు సత్తుపల్లికి చెందిన వ్యక్తితో చాటింగ్ చేసి వాట్సాప్ నెంబరు ఇచ్చింది. తర్వాత ఫోన్‌లో మాట్లాడిన ఆమె తన తల్లికి ఆరోగ్యం బాగాలేదని, డబ్బులు కావాలని కొంత నగదు తీసుకుంది. తర్వాత మళ్లీకొంత నగదు కావాలని పలుమార్లు డబ్బులు తీసుకుంది. కొద్దిరోజుల తర్వాత తన డబ్బులు తిరిగి ఇవ్వాలని సదరు వ్యక్తి లావణ్యను అడగ్గా తన వద్ద ఒక చెక్ ఉందని అది క్లియర్‌చేస్తే అమౌంట్ వస్తాయని, అందుకు కూడా డబ్బులు కావాలంటూ నమ్మబలికి మళ్లీ నగదు తీసుకుంది. ఇలా విడతల వారీగా మొత్తం రూ.16,05,778 నగదును తీసుకుంది. డబ్బులు ఇవ్వాలని గట్టిగా అడగడంతో లావణ్య స్నేహితుడైన యాదాద్రి భువనగిరిజిల్లా చౌటుప్పల్ మండలం కేసారం గ్రామానికి చెందిన సరిపల్లి శ్రీకాంత్ అనే యువకుడికి సత్తుపల్లికి చెందిన వ్యక్తి ఫోన్ నెంబరు ఇచ్చి మాట్లాడమని చెప్పింది. దీంతో సదరు వ్యక్తికి శ్రీకాంత్ ఫోన్ చేసి నా చెల్లిని ఎందుకు వేధిస్తున్నావు, నా చెల్లితో మాట్లాడినవి, చాటింగ్ చేసినవి అన్ని ఆధారాలున్నాయని, నీ ఫొటోలు సోషల్‌మీడియా నుంచి తీసుకున్నామని, వాటిని మార్ఫింగ్ చేసిసోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదరించారు . దీంతో మోసపోయానని గుర్తించిన సదరు వ్యక్తి ఆగస్టు 28న ఖమ్మం సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు విచారణ నిర్వహించి వారిని గుర్తించారు. దీంతో పోలీసులు ఈనెల 19న విశాఖపట్నంవెళ్లి సరిపల్లి శ్రీకాంత్, వంకర లావణ్యలను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈకేసును చేధించడంలో ముఖ్యపాత్ర పోషించిన సైబర్‌క్రైం డీఎస్పీ ఆర్‌వీ ఫణీందర్, ఎస్ఐ, రంజిత్‌కుమార్, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సిబ్బందిని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అభినందించారు.

సికింద్రాబాద్ డివిజన్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడిగా ఖాజా



ఖాజా బాబాను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ అధ్యక్షుడిగా రెండో సారి ఎస్కే. ఖాజా బాబా నియమితులయ్యారు. యూనియన్ నూతన కమిటీలను జోనల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సీహెచ్ శంకర్‌రావు ప్రకటించారు. వీరిలో సికింద్రాబాద్ డివిజనల్ అధ్యక్షుడిగా ఖాజా బాబా, కార్యదర్శిగా పి.రవీందర్, అసిస్టెంట్ డివిజనల్ కార్యదర్శులుగా చిలుక స్వామి, శ్రీనివాస్, నాగలక్ష్మి, రమేష్‌కుమార్, జోనల్ కమిటీ సభ్యులుగా శ్రీనివాస్, నవనీత్‌సింగ్‌ను ప్రకటించారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్) బ్రాంచ్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా పని చేస్తూ అంచలంచెలుగా బ్రాంచ్ సెక్రటరీగా, డివిజనల్ అసిస్టెంట్ సెక్రటరీగా, రెండు సార్లు డివిజనల్ ప్రెసిడెంట్‌గా కాజా బాబా పదవుల్లో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం రైల్వేస్టేషన్ ఆవరణలో ఖాజా బాబాను ఘనంగా మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధినాయకత్వం తనను గుర్తించి రెండోసారి డివిజనల్ అధ్యక్షుడిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. బ్రాంచ్‌లో చురుగ్గా పని చేస్తూ తన వెన్నంటే ఉన్నటువంటి ప్రతి ఒక్క ఉద్యోగులకు , సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, వై.గోపాల్‌రావు, రామారావు, రవితేజ, ప్రవీణ్, రవిరాజ్, అభినాష్, ప్రనీష్, విజయ్, మనోహర్ పాల్గొన్నారు.

బడి యాదిలో బాల్యమిత్రులు

- రజతోత్సవాల్లో 1973-74 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు
- కుటుంబ సభ్యులతో హాజరు
- నాడు కుర్రాళ్లుగా... నేడు వృద్ధులుగా..



1973-74వ సంవత్సరం బోధించిన గురువులతో పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు

దమ్మపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 1973-74వ సంవత్సరంలో దమ్మపేట జిల్లాపరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుకొని 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అప్పటి విద్యార్థులు.. ఇప్పటి వృద్ధులు పాఠశాలలో ఆదివారం కలిసి ఘనంగా రజతోత్సవాలు నిర్వహించారు. ఆబ్యాచ్‌లో 11మంది విద్యార్థులు చదువుకోగా వీరిలో తొమ్మిది మంది కుటుంబసభ్యులు మనుమలు, మనవరాళ్లతో కార్యక్రమానికి హాజరై సంతోషంగా గడిపారు. అప్పటి విద్యార్థులు గురువులైనటువంటి వసంతరావు, డి. ప్రసాదరావు, అంజయ్య, పసుమర్తి ముక్తేశ్వరరావును ఘనంగా సత్కరించారు. అప్పటి విద్యార్థుల్లో ముగ్గురు ఉపాధ్యాయులు కాగా ఒకరు ఐఎఫ్ఎస్ అధికారి పదవీవిరమణ చేశారు. మరికొందరు వ్యాపారం, వ్యవసాయ వృత్తుల్లో స్థిరపడ్డారు. అప్పటి విద్యార్థులు పాఠశాలలో తమ కుటుంబ సభ్యులతో కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. చిన్నతనంలో ఆడుకున్న గోళికాయలు, గోణీబిళ్ల, రన్నింగ్, మ్యూజికల్‌చైర్ ఆటలను గుర్తుచేసుకొన్నారు. ఆనాడు దండించిన ఉపాధ్యాయులను గుర్తుచేసుకున్నారు. తమ గురువులను కుటుంబ సభ్యులకు పరిచయం చేశారు. ఈకార్యక్రమంలో ఆనాటి విద్యార్థులు పసుమర్తి మల్లికార్జునరావు, రావెల్లి అజయ్‌కుమార్, సీహెచ్ సూర్యనారాయణ, స్వర్ణకుమారి, వై. లక్ష్మి, ఎం. సులోచన, శివాజీ, పెదబాబు, చినబాబు, ఎలికే నాగేశ్వరరావు, సత్యనారాయణ, చక్రధరరావు, కక్కిరాల వెంకటేశ్వరరావు తదితురులు పాల్గొన్నారు.



మంచుకొండ వైద్యాధికారిగా వెంకటరమణ

రఘునాథపాలెం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మంచుకొండ వైద్యాధికారిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణను నియమించారు. ఇటీవల మంచుకొండ పీహెచ్‌సీని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆకస్మిక తనిఖీ చేసిన సమయంలో వైద్యులు అందుబాటులో లేక పోవటంతో వైద్యాధికారి శ్రీదేవిపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో మండల వైద్యాధికారి ఖాళీ ఏర్పడింది. సీనియర్ మెడికల్ ఆఫీసర్, డిప్యూటీ సివిల్ సర్జన్, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వెంకటరమణను పీహెచ్‌సీకి కేటాయించటం వైద్యశాఖలో చర్చనీయాంశంగా మారింది.

రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు
(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	24రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	54
పచ్చిమిర్చి	28
కాకరకాయ	38
బెండకాయ	28
పొట్లకాయ	38
దోసకాయ	28-40
నాటుచిక్కుడు	88
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	28
దొండ	60-66
సొరకాయ	28
క్యారెట్	34
క్యాప్సికం	68
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	185
కొత్తిమీర కట్ట	30

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	బచ్చలమల్లి
సాయిరాం:	విడుదల
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ

నో టీ ఫ్రెష్..!

» 'ప్రజావాణి'లో అధికారులకు చాయ్‌లేదు.. బిస్కెట్ లేదు?
» విస్మయం వ్యక్తం చేస్తున్న అధికారులు..?



ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన జిల్లా అధికారులు (ఫైల్)

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం అది.. దాదాపు 60 మంది అధికారులు.. కలెక్టర్‌తో సహా మరో ముగ్గురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొనే కార్యక్రమం.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సుమారు నాలుగు గంటల పాటు కొనసాగే కార్యక్రమం..!' ఇలాంటి కార్యక్రమంలో ఒక చాయ్ లేదు.. బిస్కెట్ లేదు.. కనీసం రీఫ్రెష్ లేకపోవడంపట్ల అధికారులు, ఉద్యోగులు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోతో పాటు కనీసం 50 ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలు.. అర్జీదారులు ఎక్కువగా వస్తే మరో గంట పాటు కనీసం 3 గంటలకు ముగుస్తుంది. అలాంటి ఈ కార్యక్రమానికి అధికారులకు కనీసం మంచినీళ్ల అదీ కూడా మిషన్ భగీరథ నీళ్ల తప్ప.. ఒక్క టీ ఇవ్వడం లేదు.. బిస్కెట్ ఇవ్వడం లేదని వాపోతున్నారు.

గతంలో చాయ్ బిస్కెట్...!

గతంలో జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించినప్పుడు అధికారులకు బిస్కెట్, టీ ఇచ్చే వారు. కానీ క్రమేణా రీఫ్రెష్ మెంట్‌కు బ్రేక్ పడింది. కొత్త కలెక్టరేట్‌కు వచ్చిన తర్వాత టీమాత్రం అందించేవారు. కానీ ఇటీవల కాలంలో కలెక్టరేట్‌లో క్యాంటీన్ ఇందిరశక్తికి అప్పగించిన తర్వాత ఆ టీకి కూడా దిక్కు లేకుండా పోయింది. అధికారులు బయటకు వెళ్లి టీ తాగడమే తప్ప... ప్రజావాణిలో టీ బిస్కెట్ లేకపోవడం పట్ల పెదవివిరుస్తున్నారు. ప్రజాప్రతినిధులు.. ఇతరత్రా సమీక్ష సమావేశాలకు మాత్రం టీలు, స్నాక్స్ అందించే అధికారులు... ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి మాత్రం టీ, బిస్కెట్ లేకపోవడం పట్ల అధికారులు మాకు అంత సీన్ లేదా అని ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ముజమ్మిల్‌ఖాన్ కలెక్టరేట్‌లో పలు సంస్కరణలు చేపట్టి మార్పులు తీసుకొస్తున్నట్లే.. ప్రజావాణి కార్యక్రమంలోనూ అధికారులకు టీ స్నాక్స్ అందించేలా చర్యలు తీసుకోకపోవడంపై గుసగుసలాడుకుంటున్నారు!

30న సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో ఖమ్మం అర్బన్ మండల స్థాయి పదోతరగతి సాంఘికశాస్త్ర ప్రతిభా పరీక్ష ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు ఫోరం నిర్వాహకులు ఉమాదేవి, సురేష్ తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 11గంటల వరకు రిక్కా బజార్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి తెలుగు, ఇంగ్లీష్ మీడియం, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు అనుమతి ఉందన్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను మండల, జిల్లా స్థాయి వరకు మాత్రమే అనుమతిస్తారన్నారు. ప్రతి విభాగం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులను జనవరి 4న ఖమ్మంలో జరిగే జిల్లా స్థాయి ప్రతిభా పరీక్షకు ఎంపిక చేస్తామన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు పరీక్షలో పాల్గొనవచ్చునని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రూ.20లు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు రూ.50లు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 9989957618, 9963505955 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

వెంకటస్వామి ఆశయసాధనకు కృషిచేయాలి

కలెక్టరేట్‌లో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కళావతిబాయి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కారుమంచి. శ్రీనివాసరావు తదితరులు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సుదీర్ఘకాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా దేశానికి సేవలు అందించిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని అన్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు. వెంకటస్వామి అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో..

ఖమ్మంచర్చికాంపౌండ్(ఆంధ్రజ్యోతి): మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు, కేంద్రమాజీ మంత్రి జి.వెంకటస్వామి వర్ధంతిని మాలమహానాడు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత పీవీ రావు, వెంకటస్వామి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. మాలమహానాడు జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం, గౌరవ సలహాదారులు లింగాల రవికుమార్, మాలమహానాడు నాయకులు కొరివి దయానంద్, కొట్టి సుధాకర్, పేరం మల్లయ్య, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

ఏడీసీపీ ప్రసాదరావు

తిరుమలాయపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అనునిత్యం పనిచేయాలని, లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీ ప్రసాదరావు అన్నారు. ఆదివారం మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన ఆరెంపుల వెంకమ్మ అనే వృద్ధురాలిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి బంగారం ఎత్తుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన గ్రామంలో పర్యటించారు. ఘటనకుసంబంధించిన వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చోరీకి పాల్పడిన నిందితుల కోసం పోలీసుల ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి వారిని అరెస్టు చేస్తామన్నారు. అలాగే మండలంలో దొంగతనాలు, రాజకీయ ఘర్షణలు జరగకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. దొంగతనాల నివారణకు రాత్రివేళలో పోలీసులు పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. అనుమానితులను గుర్తించి వారి వివరాలు సేకరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ కూసుపుడి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకులకు ఘన సన్మానం

ఖమ్మం రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోళ్లపాడు, పోలేపల్లి గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజని, పాలేరు నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బానోతు కిరణ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోటి రమణ తదితరులను కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్క శేఖర్ గౌడ్, మద్ది మల్లారెడ్డి, సందీప్, సింగిరెడ్డి, బోసిరెడ్డి, శేఖర్, మహేష్ పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీకి యత్నం

ఖమ్మం క్రైం డిసెబంరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రెండిళ్లలో చోరీకి యత్నించిన సంఘటన ఆదివారం జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మామిళ్లగూడెంలోని గాయత్రి భవన్ ప్రాంతంలో రెండు నివాస గృహాలలో దొంగలు చోరీకి యత్నించారు. దీంతో ఇంటి యజమానులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కాగా ఈ ఘటనలో ఎలాంటి ఆస్తిచోరీకి గురికాలేదని పోలీసులు తెలిపారు.

'ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం'



సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావీద్

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యం ఉంటుందని టీపీసీసీ సభ్యుడు, ఖమ్మం నగర అధ్యక్షుడు ఎండీ జావీద్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. క్రైస్తవ మత పెద్దలతో కలిసి నాయకులు కేక్ కట్ చేశారు. కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మైనార్టీ రాష్ట్ర కన్వీనర్ రబ్బానీ, ఐఎన్‌టీయూసీ నాయకులు విప్లవ్‌కుమార్, కొంటేముక్కల నాగేశ్వరరావు, బాణాల లక్ష్మణ్, ఆనందరావు పాల్గొన్నారు.

సైన్స్ క్విజ్‌లో విద్యార్థుల ప్రతిభ

కామేపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గురుదక్షిణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీల్లో కామేపల్లి మండలం రామక్రిష్ణపురం గీతాంజలి పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పదోతరగతి విద్యార్థిని షేక్ సల్మా జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి, 9వ తరగతిలో నాగుబండి లక్ష్మినర్సింహ బహుమతు లు సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ దయానంద్ విద్యార్థులను అభినందించారు.

'ఇందిరమ్మ' ఇళ్ల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

తిరుమలాయపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు అధికారులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని కొక్కిరేణి, ఎర్రగడ్డ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈసర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా నిజమైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఈనెల 25వరకు ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వేను పూర్తిచేయాలని, ఆదేశించారు. ఇళ్లకోసం దరఖాస్తులను పరిశీలించి వివరాలను ప్రభుత్వానికి అందించాలన్నారు. యాప్‌లో పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదుచేయాలన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఎంపీవో నరసింహారావు, పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

దీక్షలకు ప్రజాపోరాటాల నాయకురాలు విమలక్క సంఘీభావం



మాట్లాడుతున్న విమలక్క

ఖమ్మం ఖానాపురంహవేలి/సంక్షేమవిభాగం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులు 12 రోజులుగా చేస్తున్న దీక్ష శిబిరానికి ఆదివారం ప్రజా ఉద్యమాల పోరాట వనిత విమలక్క దీక్షా శిబిరానికి చేరుకొని దీక్షకు సంఘీభావం తెలిపారు. ఉద్యోగులు న్యాయమైన డిమాండ్ పేస్కేల్‌ను ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని అన్నారు. లేకుంటే ఉద్యమంలో భాగమై పోరాడుతానని పిలుపునిచ్చారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు చీపుర్లతో రోడ్లు ఊడుస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం సంక్షేమ విభాగం (ఆంధ్రజ్యోతి): రోజులు నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపడుతుంటూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవటం దుర్మార్గమని టీయూసీఐ(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శి జీ రామయ్య ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యయుతంగా చేపట్టే నిరవధిక నిరసన కార్యక్రమాలను ప్రభుత్వం గుర్తించి ఆయా కార్మికులు, ఉద్యోగులతో చర్చ లు జరపాలని, ప్రభుత్వ నిరంకుశ, మొండి వైఖరి సరైందికాదని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యా సమస్యల పరిష్కారానికి కృషి

పీఆర్‌టీయూ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి

ఖమ్మం కానాపురంహవేలి డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి విజయానికి సహకరిస్తే విద్యా రంగంలోని ప్రతి సమస్యని పరిష్కరించేందుకు కృషి చేస్తానని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా శాఖ అధ్యక్షుడు కొమ్మినేని అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పేరుతో బెదిరించిన వారిపై కేసు నమోదు

ఖమ్మం క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసుల పేరుతో ఓ టిప్పర్ డ్రైవర్‌ను బెదిరించిన ఘటనలో ముగ్గురిపై ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్ నందు ఆదివారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మణుగూరు నుంచి ఇసుకతో వస్తున్న ఓ టిప్పర్‌ను నగరంలోని ఎన్‌టీఆర్ సర్కిల్ సమీపంలో నగరానికి చెందిన మాధవరావు, హర్ష, నాగరాజు అనేవారు పోలీసులమని బెదిరించారు. లీగల్‌గా అన్నీ అనుమతులతో ఉన్నాయంటూ టిప్పర్ డ్రైవర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు.

ఎస్ఆర్ కళాశాలలో విజన్ లీడర్‌షిప్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కళాశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురం హవేలి డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఆదివారం విద్యార్థులకు విజన్ లీడర్‌షిప్, ప్రపంచ స్థాయి అవకాశాలపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, అడ్మిషన్స్ డైరెక్టర్ శేషగిరిరావు హాజరై మాట్లాడారు. విశ్వవిద్యాలయ ప్రత్యేకతను, గ్లోబల్ భాగస్వామ్యాలను వివరించారు. కళాశాలలో నిర్వహిస్తున్న డ్యుయల్ డిగ్రీ కోర్సులు, ఇంటర్నేషనల్ ఇంజనీరింగ్ ప్రోగ్రాం తదితర కోర్సుపై విద్యార్థులకు వివరించారు. యూనివర్శిటీలో 40కిపైగా విద్యార్థులు స్టార్టప్ కంపెనీలు నిర్వహిస్తుపలువురికి ఉద్యోగా అవకాశాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల రిజిస్ట్రార్ అర్చన రెడ్డి, అనితా, తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

ఖమ్మంలో బీజేపీయేతర పార్టీల నిరసన



ఖమ్మంలో ర్యాలీ నిర్వహిస్తున్న విపక్షపార్టీల నాయకులు

ఖమ్మంటౌన్/చర్చికాంపౌండ్/నేలకొండపల్లి/రఘునాథపాలెం డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రివర్గంనుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని ధర్నాచౌక్ నుంచి జడ్పీసెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించిన అనంతరం సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు నున్నా నాగేశ్వరరావు, బాగం హేమంతరావు, ఎస్‌డీ. హసేన్. పీవై. పుల్లయ్య మాట్లాడుతూ దేశంలో కులం, మతం, ప్రాంతం ఆధారంగా సమాజ మనుగడ ఉండకూడదని అంబేద్కర్ భావించారని, ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు, పేదలకు రాజ్యాంగమే రక్షణగా ఉందన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, వై.విక్రమ్, దండి సురేష్, శింగు నర్సింహారావు, మాచర్ల భారతి, ఆవుల అశోక్, ఝాన్సీ, సుబ్బారావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు మెరుగు సత్యనారాయణ, ఎస్‌కే. నాగుల్‌మీరా, బోడపట్ల సుదర్శన్, భూక్యా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖమ్మంచర్చికాంపౌండ్ (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం నగరంలోని జడ్పీసెంటర్‌లో కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లరిబ్బన్లతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మాచర్ల భారతి, బొట్ల సాగర్, నకిరికంటి చిరంజీవి, జార్జి, అద్దంకి విప్లవకుమార్, మాచర్ల గోపాల్ పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

నేలకొండపల్లి (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో అంబేద్కర్‌ను అవమానిస్తూ మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కేవీ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో అమిత్‌షా దిష్టిబొమ్మను సీపీఎం కార్యకర్తలు దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు, రచ్చా నర్సింహారావు, కట్టెకోల వెంకన్న, పెద్దిరాజు నర్సయ్య, మందడపు మురళీకృష్ణ, మంకెనపల్లి నర్సింహారావు, మార్తి కొండలరావు, బలుసు ప్రమీల సామాల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రఘునాథపాలెం(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాక్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని బీజేపీయేతర రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. ఆదివారం రఘునాథపాలెం సెంటర్‌లో ఆయా రాజకీయ పార్టీల నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు వాంకుడోత్ దీప్లానాయక్, మందా బుచ్చిబాబు, కేలోత్ లక్ష్మణ్, ఆవుల మంగతాయి, ఎస్ నవీన్‌రెడ్డి, దేవ్‌సింగ్, కోటేష్‌నాయక్, దారావత్ లక్ష్మణ్, కోటేష్‌నాయక్, రాము, బుచ్చిబాబు, రామూర్తి, కూచిపూడి నరేశ్ పాల్గొన్నారు.

న్యాయవాది రమేష్ కుటుంబానికి తుమ్మల పరామర్శ



శ్రీస్వామి చిత్రపటానికి పూలమాల వేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యాయవాది స్వామి రమేశ్ తండ్రి శ్రీస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఖమ్మంలోని స్వామిరమేశ్ నివాసానికి వెళ్లి శ్రీస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పటల్‌లో వైద్యసేవలు పొందుతున్న కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేందర్ కుమారుడు కుశల్‌ను పరామర్శించారు. మంత్రి తుమ్మల వెంట ఎంపీ రఘురామరెడ్డి ఉన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన కార్పొరేటర్ వైష్ణవి

ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్ కన్నం వైష్ణవి మర్యాదపూర్వకంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదివారం కలిశారు. తన డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, పాలేపు విజయవెంకటరమణ, కమర్తపు మురళీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాదు రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రామానుజన్ ఆవిష్కరణలు స్ఫూర్తిదాయకం

సీఎంవో రాజశేఖర్

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని అబ్బురపరిచిన భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ శాస్త్రీయ ఆవిష్కరణలు అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ (సీఎంవో) యలగందుల రాజశేఖర్ అన్నారు. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఖమ్మంలోని ఇందిరానగర్ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభాపాటవాలు వెలికి తీయటానికి గణిత సంబంధమైన ఆవిష్కరణలు మార్గదర్శకంగా నిలుస్తాయని, వాటి నుంచి తగిన ప్రేరణ కూడా పొందవచ్చని ఆయన తెలిపారు. గణిత శాస్త్ర పరంగా ప్రపంచానికి మన పూర్వీకులు ఎన్నో ఆవిష్కరణలు అందించారని తెలిపారు. నేడు ప్రపంచంలో అత్యధికంగా అన్ని రంగాల్లో వినియోగిస్తున్న దశాంశమానాన్ని ప్రపంచానికి అందించింది భారతీయులేనన్నారు. అదేవిధంగా 'సున్నా' ను ఆవిష్కరించి ప్రపంచానికి మన మేధావులు అందించారని తెలిపారు.

కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు హరిప్రసా ద్, నాగశ్రీ, రామనాథం, శాంతి, సాగర్ విద్యార్థులు పాల్గొన్నారు. గణిత శాస్త్ర దినోత్సవ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు గణిత భావనలతో రూపొందించిన రంగవల్లులు అందర్ని ఆకట్టుకున్నాయి.

కేజీబీవీ ఎదుట ధర్నా

ఖమ్మం రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దతండా పరిదిలోని కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థులకు పదిరోజులుగా క్లాసులు జరగకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ అన్నారు. రాష్ట్ర కమిటి పిలుపులో బాగంగా కస్తూర్బా పాఠశాల ఎదుట ఆదివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతు తక్షణమే ప్రభుత్వం ఉపాధ్యాయులతో చర్చలు జరిపి విద్యార్థులకు పాఠ్యాంశాలు జరిగేలా చొరవ చూపాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా శ్రీను, వెంకటేష్, అశోక్, అఖిల, స్పందన, సింధు, మనీషా, తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

టీడీపీలో చేరిన ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్



టీడీపీ సభ్యత్వం స్వీకరిస్తున్న భద్రరాజు

తల్లాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైరా మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ తల్లాడకు చెందిన దూపాటి భద్రరాజు ఆదివారం బీజేపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో భద్రరాజుకు టీడీపీ కండువా కప్పి పార్టీ జిల్లా నాయకుడు కేతినేని హరీష్ ఆహ్వానించారు. గతంలో రెండుసార్లు టీడీపీ మండల అధ్యక్షుడిగా భద్రరాజు పనిచేసి తిరిగి మళ్లీ పార్టీలోకి రావడం సంతోషంగా ఉందని హరీష్ అన్నారు. కార్యక్రమంలో కూచిపూడి వెంకటేశ్వరరావు, సరికొండ శ్రీనివాసరాజు, రావూరి రవిప్రసాద్, నారపోగు ప్రసాద్, నున్నా రామారావు, గరిక వెంకటేశ్వర్లు, కొమ్మినేని సత్యనారాయణ, దగ్గుల శివారెడ్డి పాల్గొన్నారు.

వైరా రిజర్వాయర్ ఆనకట్టపై చిమ్మచీకట్లు

▸ సోలార్ లైట్లను ధ్వంసం చేస్తున్న అగంతకులు



అగంతకుల విధ్వంసంతో వెలగని సోలార్ లైట్

వైరా, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ ఆనకట్ట సుందరీకరణలో భాగంగా రెండేళ్ల కిందట ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ లైట్లు అగంతకుల దుశ్చర్యలతో ధ్వంసం చేస్తున్నారు. ఫలితంగా 45లైట్లు గత కొన్ని నెలల నుంచి వెలగడం లేదు. రిజర్వాయర్ ఆనకట్టపై చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయి. రూ.నాలుగున్నర కోట్లతో వైరా రిజర్వాయర్ ఆనకట్ట పటిష్టత, సుందరీకరణను ఎనిమిది సంవత్సరాల కిందట చేపట్టారు. ఆనకట్ట వెడల్పు, పటిష్టత తర్వాత రెండేళ్ల కిందట సుందరీకరణ కోసం రూ.31లక్షలతో 71 సోలార్ విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. కొంతకాలం రిజర్వాయర్ ఆనకట్ట సోలార్ లైట్ల కాంతులతో విరాజిల్లింది.

బ్యాటరీ, లైట్లు చోరీ...

కొన్నినెలలపాటు దేదీప్యామానంగా వెలుగులు పరిచిన సోలార్ విద్యుత్ లైట్లపై అగంతకుల కన్ను పడింది. ఇక అప్పటి నుంచి ఈ లైట్ల ధ్వంసం మొదలైంది. 71లైట్లకుగానూ ఇప్పుడు 45లైట్లు వెలగడం లేదు. దాదాపు 25 లైట్లకు ధ్వంసం చేసి వాటిలోని బ్యాటరీలను అపహరించుకుపోయారు. అంతేకాకుండా కొంతకాలం నుంచి ఏకంగా స్తంభాలను విరగగొట్టడం మొదలైంది. ఇప్పటికే ఒక స్తంభాన్ని మధ్యవరకు విరగగొట్టి అపహరించుకుపోయారు. వారం కిందట రిజర్వాయర్ గేట్ సమీపంలోని మరో స్తంభాన్ని విరగగొట్టారు. విరగగొట్టిన స్తంభాన్ని అపహరించుకుపోయే వీల్లేకపోవడంతో ఆనకట్టపైననే రెయిలింగ్ పక్కన పడవేశారు. ఇంకా కేవలం 26సోలార్ విద్యుత్ లైట్లు మాత్రమే వెలుగుతున్నాయి.

ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు, వాకర్స్...

ప్రతిరోజూ వందలాదిమంది స్థానికులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రిజర్వాయర్ ఆనకట్టను సందర్శిస్తుంటారు. అలాగే వేకువజాము నుంచి సాయంత్రం ఆరుగంటల తర్వాత వందలమంది వాకింగ్ చేస్తుంటారు. ఈ సమయంలో సోలార్ లైట్లు వెలగక చీకట్లో వాకర్స్ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాములు, ఇతర విషపురుగులు సంచరిస్తుండటంతో భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సోలార్ లైట్ల విధ్వంసం జరుగుతున్నా వాటిని నివారించి రక్షణ కల్పించేవారే లేకపోవడంతో అగంతకులు మరింత రెచ్చిపోతున్నారు. సోలార్ లైట్లే కాకుండా ఆనకట్టకు ఏర్పాటు చేసిన రెయిలింగ్ పైపులను కూడా అపహరించుకుపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వీటిమీద దృష్టి సారించి ఈ అగంతకుల ఆగడాలకు చెక్ పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా ధ్వంసమైన సోలార్ లైట్లను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

▸ ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్

వైరా, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. ఆదివారం వైరా క్యాంపు కార్యాలయంలో రూ.80లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ, రైతుభరోసా, భూభారతి వంటి పథకాలను ప్రభుత్వం అమలుచేస్తుందన్నారు. వివిధ గ్రామాలను అనుసంధానం చేస్తూ లింక్‌రోడ్లను కూడా పూర్తిచేయటం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల పార్టీ మండల అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, చల్లారి చంద్రప్రకాష్, మంగీలాల్, స్వర్ణ నరేంద్ర, పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు దొడ్డా పుల్లయ్య, పమ్మి అశోక్, నర్వనేని అశోక్, మట్టూరి వెంకటేశ్వరరావు, పొదిల హరినాథ్, సూరంపల్లి రామారావు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

▸ ప్రవచనకర్త, ఉపన్యాస రత్న నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య



కవ్వం చిలుకుతున్న రామకృష్ణమాచార్య

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం జరిగే చోట చక్కటి ఫలితాలు కలుగుతాయని, అతివృష్టి లేకుండా, అనావృష్టి లేకుండా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రవచనకర్త, ఉపన్యాస రత్న నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య అన్నారు. ధనుర్మాసం సందర్భంగా 7వ రోజు ఆదివారం మండలంలోని రేజర్లలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో దధిమదన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆనాడు క్షీరసాగర మధనం ఎంతకష్టమో గోపికలు శ్రీ కృష్ణుడి కోసం పెరుగును చిలకడం.. కూడా అలాగే ఉండేదని, ఈ ధనుర్మాసం జరిగే ప్రాంతాలలో పాడిపంటలకు కలిగి ప్రజల ఆయురారోగ్యాలకు లోటు ఉండదన్నారు. కార్యక్రమంలో మంజుభాషిని, ఒగ్గు పుష్పావతి, నాగేంద్రమ్మ, లక్ష్మి, సావిత్రి, ప్రేమలత, మాధవి, కాసర్ల సావిత్రి, ఉమామహేశ్వరి, శ్రీను, రామారావు పాల్గొన్నారు.

రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలి

▸ తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మినహాయింపు లేకుండా రూ.రెండులక్షల రుణమాఫీ పూర్తిచేయాలని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నూతన వ్యవసాయ మార్కెట్ విధానపత్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను రైతులు జయప్రదం చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. రైతుసంఘం ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం వైరా మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం వైరా మండల కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ ఖమ్మంజిల్లాలో లక్షమంది రైతు లకు పూర్తికాలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు బాణాల శ్రీనివాసరావు, యనమద్ది రామకృష్ణ, తోట నాగేశ్వరరావు, శ్రీనివాస్, రాజేంద్ర, రాజేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకోవడమే లయన్స్‌క్లబ్ ధ్యేయం

వైరా, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): పేదలను ఆదుకోవడమే లయన్స్‌క్లబ్ ధ్యేయమని ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. ఆదివారం వైరాలో గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మోదుగు రత్నకుమారి, వి.రాజేశ్వరిలకు కుట్టుమిషన్లు అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన అజీమ్‌కు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఉండ్రు శ్యాం బాబు, ఉండ్రు వరలక్ష్మి, తోటకూర శ్రీకాంత్, లగడపాటి ప్రభాకర్‌రావు, మునిసిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, కౌన్సిలర్ డాక్టర్ డి.కోటయ్య, డాక్టర్ రవిచంద్ర, గంగవరపు కిషన్, అజయ్, రామకృష్ణ పాల్గొన్నారు.



పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

చింతకాని, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో ఈ నెల 26వ తేదీన నిర్వహించే సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్రసమితి సభ్యుడు జమ్ముల జితెందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ 100వ సంవత్సరంలోకి అడుగెడుతున్న సందర్భంగా ఖమ్మంలో భారీ ర్యాలీ, సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వేపూరి రవింద్రబాబు, పదిమల వెంకటనర్సయ్య, షేక్ చిన్న జాన్, వజీర్, ముఖర్జీ, చాట్ల రమేష్, శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి'



తల్లాడలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

వైరా, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని సీపీఎం, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ వైరా డివిజన్ కార్యదర్శులు భూక్యా వీరభద్రం, కంకణాల అర్జున్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు చింతనిప్పు చలపతిరావు, యలదండి బాబు, పొదిల హరినాథ్, తూము సుధాకర్, తోట నాగేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు, పారుపల్లి కృష్ణారావు, గుడిమెట్ల రజిత, బాజోజు రమణ, అమరనేని కృష్ణ పాల్గొన్నారు.

సత్తుపల్లిలో...

సత్తుపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించే విధంగా మాట్లాడిన అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సత్తుపల్లి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆయన కాంస్య విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉడతనేని అప్పారావు, గాదె చెన్నారావు, ఎండీ.కమల్‌పాషా, శీలం సత్యనారాయణరెడ్డి, మోరంపూడి పాండు, దండు ఆదినారాయణ, తడిమకళ్ల యోబు, అమర్లపూడి శరత్, కొలికపోగు సర్వేశ్వరరావు, సందీప్‌గౌడ్, పానెం ఈశ్వర్, జక్కుల ప్రభాకర్ పాల్గొన్నారు.

ఏన్కూర్‌లో...

ఏన్కూరు, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం ఏన్కూరులో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాయకులు స్వర్ణ నరేంద్రకుమార్, జాగర్లముడి రంజిత్‌కుమార్, దొంతెబోయిన నాగేశ్వరరావు, కొండే వెంకటేశ్వర్లు, మేడా ధర్మారావు, పూర్ణకంటి మైసారావు, మాదినేని వెంకన్న, వర్దబోయిన బాబు, గుడ్ల వెంకటేశ్వర్లు, కట్టా సత్యనారాయణ, సక్రునాయక్, లక్ష్మానాయక్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్, సీపీఎం పార్టీలు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, మండల కాంగ్రెస్, సీపీఎం నాయకులు, కార్యకర్తలు, అంబేద్కరిస్టులు తదితరులు పాల్గొన్నారు.

మధిరటౌన్‌లో..

మధిరటౌన్, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం మధిరలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, సీపీఐ జిల్లా నాయకులు బెజవాడ రవిబాబు, దుంపా వెంకటేశ్వర రెడ్డి, వేణు, అద్దంకి రవి, కర్నాటి రామారావు, చంటిబాబు, తలుపుల వెంకటేశ్వర్లు, శీలం నరసింహారావు, పణీంద్ర కుమారి, కొండలరావు, రాధాకృష్ణ, ప్రకాశరావు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ముదిగొండలో...

ముదిగొండ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం ముదిగొండ ప్రధాన సెంటర్లో సీపీఎం ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, భద్రయ్య, కల్యాణ్, నాగేశ్వరరావు, బట్టు రాజు, మందరపు వెంకయ్య, ధర్మ య్య, లక్ష్మయ్య వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తల్లాడలో..

తల్లాడ, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌ను అవమానపర్చేవిధంగా వ్యాఖ్యానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను ఆదివారం సీపీఎం, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో తల్లాడలో దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు, నాయకులు సత్తెనపల్లి నరేష్, చల్లా నాగేశ్వరరావు, రాజబోయిన సైదులు, కటికి కిరణ్, షేక్.జమాల్, దుగ్గిదేవర రవీంద్ర, కోసూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మధిరటౌన్‌లో..



వైరాలో..



ముదిగొండలో...

ఘనంగా గణిత దినోత్సవం



శ్రీనివాస రామానుజన్ చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వైరా, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని వైరా న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో ఆదివారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మ్యాథ్స్ క్విజ్‌ను నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ షాజీ మాథ్యూవ్, ఏవో నర్సింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయునికి నివాళి



నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు గాదె ఉమామహేశ్వరరావుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నివాళి అర్పించింది. ఆదివారం సత్తుపల్లిలోని ఆయన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో చిత్రపటం వద్ద సంఘ నాయకులు సంతాపం తెలిపారు. ఉద్యోగ జీవితాన్ని అంకిత భావంతో, సేవాభావంతో గడిపిన నిస్వార్థ వ్యక్తిగా ఉమామహేశ్వరరావు పలువురికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కేశవరెడ్డి, బద్రుద్దీన్, రామిశెట్టి సుబ్బారావు, సాంబశివరెడ్డి, ఏఎస్.ప్రకాశరావు, బోడేపూడి బాబు, వెంకటరామిరెడ్డి, సత్యనారాయణ, జీవీ.రమణ, దొడ్డా కృష్ణయ్య, నారాయణరెడ్డి, మధుసూదనరాజు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకున్న బాలభారతి విద్యార్థులు

తల్లాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం గురుదక్షిణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి సైన్స్ క్విజ్ పోటీల్లో బాలభారతి విద్యాలయానికి చెందిన లక్ష్మీశ్రీజ, ఉజ్వల ప్రతిభను చాటుకున్నారు. సుమారు 75పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొనగా బాలభారతి విద్యార్థులు నాల్గోస్థానం సాధించి ప్రతిభను చాటుకున్నారు. బహుమతులు అందుకున్న విద్యార్థులను ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్, కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపల్ తాళ్లూరి రామారావు, ఏవో యాచమనేని శశాంక్ అభినందించారు.

లచ్చగూడెంలో అయ్యప్పల ఇరుముడి

చింతకాని, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలోని అయ్యప్ప స్వామి ధ్యాన మందిరంలో అయ్యప్పస్వామి మాలధారణ భక్తుల ఇరుముడి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా అయ్యప్పస్వామి సన్నిధానానికి బయలుదేరారు. కార్యక్రమంలో గురుస్వామి కత్రోజు వాసు స్వామి, సరికొండ వెంకటరాజు స్వామి, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గడ్డం వెంకటస్వామి వర్ధంతి

మధిరటౌన్, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): మాజీ కేంద్ర మంత్రి, దళిత నాయకుడు దివంగత నేత గడ్డం వెంకటస్వామి వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు ఆదివారం మధిర మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించారు. వెంకటస్వామి చిత్రపటానికి మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత పూలమాల వేసి నివాళులర్పించారు, కాకాగా పేరొందిన వెంకటస్వామి తెలంగాణ రాష్ట్ర సాధనలో తనవంతు కృషి చేశారని కొనియాడారు. రాష్ట్ర సమస్యలపై ఢిల్లీలో నిర్విరామంగా పని చేశారని అన్నారు. ఆయన ఆశయాలు సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మునిసిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ లత

తప్పుగా ఊరి పేరు బోర్డు



తూతక్కలింగన్నపేట పేరు బదులుగా తూతిక్కలింగన్నపేట పేరుగా ఉన్న దృశ్యం

ఏన్కూరు, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా గ్రామాల ఊరు పేర్ల బోర్డులు దర్శనమిస్తున్నాయి. గ్రామాల ముందు ఊర్ల పేర్లను తెలిపే బోర్డుల్లో తప్పులు దొర్లినా అలానే ఏర్పాటు చేయడం శోచనీయం. ఏన్కూరు మండలం తూతక్కలింగన్నపేట గ్రామ ఊరు పేరు తెలిపే బోర్డు తప్పుగా ఉంది. 'తూతక్క' లింగన్నపేటకు బదులుగా 'తూతిక్క' అని ఉండడం పట్ల గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బోర్డు లోని తప్పును సరిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సింగరేణి గ్రామంలో వేడుకలేవీ..

కారేపల్లి, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): బొగ్గు గనులకు పుట్టినిల్లు అయినటువంటి సింగరేణి గ్రామంలో సంస్థ అధికారులు ఆవిర్భావ వేడుకలను నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పంచాయతీకి చెందిన పలువురు అధికారుల తీరును విమర్శిస్తున్నారు. ప్రతి ఏడాది డిసెంబరు23న సంస్థ వేడుకలను ఘనంగా నిర్వహించాల్సి ఉంది కాని అధికారులు గత నాలుగేళ్లగా వేడుకలను నిర్వహించడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయంలో మంత్రిగా పనిచేసిన తుమ్మల నాగేశ్వరరావు కృషితో సింగరేణి గ్రామంలో రూ.2కోట్ల వ్యయంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆతరువాత మరికొన్ని సంవత్సరాలు వేడుకలను నిర్వహించిన అధికారులు వాటిని వదిలివేశారు. ఖమ్మం ఎంపీగా ఉన్న నామా నాగేశ్వరరావుతో అప్పటి గ్రామపంచాయతీ సర్పంచ్ మండెపుడి రాణి, ఆమె భర్త మండెపుడి శ్రీనువాస్‌రావు, అప్పటి వైరా ఎమ్మెల్యే బానోత్ చంద్రవతి సింగరేణి సంస్థ సీఎండిని కలిసి అభివృద్ధి కార్యక్రమాల కోసం కొన్ని నిధులు తీసుకవచ్చారు. తరువాత బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే బానోత్ మంగీలాల్ సహకారంతో సంస్థ అవిర్భావ వేడుకలను నిర్వహించారు. అటు తరువాత వేడుకలను నిర్వహించలేదు.

పీవీరావు వర్ధంతి



పీవీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తల్లాడ/కారేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో ఆదివారం మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీరావు వర్ధంతిని నిర్వహించారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దామవరపు నర్సింహారావు ఆధ్వర్యంలో పీవీరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్ష, కార్యదర్శులు బండి బాలశౌరి, కొండా జాను, కందుల నారాయణ, వేముల అశోక్, అమర్లపూడి సిల్వరాజ్, సాతునూరి చిరంజీవి పాల్గొన్నారు.

కారేపల్లి, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు వ్యవస్థాక అధ్యక్షుడు పీవీరావు 19వ వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలో జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు సోమందుల రాములు, తలారి చంద్రప్రకాష్, శ్రీరాములు, సోమందుల నాగరాజు, టోని, సామేలు, రమేష్, నిర్మల పాల్గొన్నారు.